

హైదరాబాద్ వార్త

# ప్రతి పనికో 'రేటు'

**◄అవినీతికి అడ్డాగా రిజిస్ట్రేషన్ కార్యాలయాలు**
**◄నేరుగా వెళితే కొర్రీలతో కాలయాపన**
**◄దళారుల ద్వారా అయితే గంటల్లో పనిపూర్తి**
**◄వరుస ఏసిబి దాడులతో అధికారుల్లో కలవరం**





**హైదరాబాద్, నవంబర్ 18,ప్రభాతవార్త:** నగరంలోని రిజిస్ట్రేషన్ ఆఫీసుల్లో అవినీతికి అడ్డు అదుపు లేకుండా పోతుంది, నేరుగా వెళ్ళిన వారి రిజిస్ట్రేషన్లను చేయని అధికారులు దస్తావేజులేఖరులు తెచ్చే రిజిస్ట్రేషన్‌లను వెంటనే చేస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. దాంతో ప్రజలు దళారులను ఆశ్రయించాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని, దాంతో దళారులు అదునుగా భావించి అధికంగా వారి ఇష్టానుసారంగా వసూళ్ళకు పాల్పడుతున్నారని, ఈ వ్యవహారం బహిరంగ రహస్యం అయినప్పటికి ఉన్నాతాదికారులు ఎలాంటి చర్యలు తీసుకోవటం లేదు. నేరుగా వెళ్ళే వారికి ఏదో ఒక సాకు చెప్పి తిప్పి పంపడం వల్ల తప్పక వీరిని ఆశ్రయించాల్సివస్తోందని ప్రజలు వాపోతున్నారు. వాల్యువేషన్ సర్టిఫికేట్ , ఈసీ ఇలా ఏం కావాలన్నా వీరినే ఆశ్రయించేలా చేయడం అధికారుల వ్యవహార తీరులో అర్థమౌతుందని ఆరోపిస్తున్నారు. దాంతో సబ్ రిజిస్ట్రార్ ఆఫీసుల్లో దళారులదే హవా నడుస్తుంది. ప్రభుత్వం రిజిస్ట్రేషన్ ఆఫీసుల్లో దళారీ వ్యవస్థ ను రద్దుచేసినప్పటికీ వారి హవానే కొనసాగుతుంది. దీంతో సాధారణ ప్రజలు ఇబ్బందులకు గురి అవుతున్నారు. రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో ఎన్నో సౌకర్యాలు కల్పిస్తున్నట్లు ప్రభుత్వ ప్రచారం చేస్తున్నా ,అవి క్షేత్రస్థాయిలో అమలు కాలేకపోతున్నాయి. రిజిస్ట్రేషన్ కోసం ఆన్‌లైన్ దరఖాస్తు చేసుకునే వీలుంది. కానీ ఆన్‌లైన్ దరఖాస్తులను పరిశీలిచేనాధుడే లేడు. రిజిస్ట్రేషన్ కావాలంటే లేఖరులే అన్నీ తామై వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. పొరపాటున రిజిస్ట్రేషన్ కోసం కార్యాలయానికి దరఖాస్తు పట్టుకుని వెళితే, అక్కడ సిబ్బంది అదిలేదు, ఇదిలేదు అంటూ నానా కొర్రిలు పెట్టి వెనక్కి పంపిస్తున్నారని పలువురు విమర్శిస్తున్నారు. తప్పని పరిస్థితుల్లో దళారులకు అధికమెత్తం చెల్లించి తమ రిజిస్ట్రేషన్‌లు చేయించాలి్స వస్తుందని సామాన్యులు వాపోతున్నారు. ఇదంతా ఎందుకులే లేఖరులకు ఇస్తే అంతా వాళ్ళే చూసుకుంటారన్న ఆలోచనను దరఖాస్తు దారులకు కల్పిస్తున్నారని ఆరోపణలు వస్తున్నాయి. దీనికితోడు రిజిస్ట్రార్ కార్యాలయంలో హెల్ప్ డెస్క్‌లు ఏర్పాటు చేయాల్సి ఉన్నప్పటికీ అవి ఎక్కడా కనిపించటం లేదు. వాస్తవానికి ఒక రిజిస్ట్రేషన్‌కు ప్రభుత్వం రేటు ఎంత ఉంటుందో దానికి రెట్టింపు మెత్తంలో దస్తావేజు లేఖరులు వసూలు చేస్తున్నారు. ఇందులో క్రింది స్థాయి నుండి పై స్థాయి అధికారుల వరకూ వాటాలు న్నాయన్న ఆరోపణలు ఉన్నాయి. వివాహ రిజిస్ట్రేషన్, వాల్యువేషన్ సర్టిఫికేట్ల కోసం వచ్చిన వారి నుండి అధికంగా వసూలు చేస్తు పట్టుబడ్డ దాఖలాలు ఉన్నాయి. కాబట్టి అధికారులు రిజిస్ట్రేషన్ ఆఫీసులపై నిఘా పెంచి కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

**కీలక సంస్కరణలు తీసుకొచ్చినా..**

అవినీతికి అడ్డుకట్ట వేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం 2024 ఫిబ్రవరి నుంచి రిజిస్ట్రేషన్ల శాఖలో కీలక సంస్కరణలు తెచ్చింది. అయినా కొందరి తీరు మారకపోవడంతో ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. నగరంలోని పలు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల పరిధిలో వసూళ్ల తీరు దారుణంగా ఉంది. దళారుల ప్రమేయంతో అధికారులు నిబంధనలకు పాతరేస్తున్నారు. నాలా పన్ను చెల్లించకున్న రిజిస్ట్రేషన్లు చేసేస్తున్నారు. హైదరాబాద్ నగరం చుట్టుపక్కల గజానికి రూ.200 నుంచి రూ.500 జిల్లాల్లో అయితే రూ.100 చొప్పున వసూలు చేస్తున్నారు. నీటి వనరులకు చెంత ఉన్న ప్రాంతమైనతే మరింత దండుకుంటున్నారు. లింక్ డాక్యుమెంట్లు లేని ఆస్తులకూ రిజిస్ట్రేషన్లు చేస్తున్నారు. మూడు అంతకన్నా ఎక్కువ అంతస్తుల భవనాలైతే అంతస్తుకు ప్రాంతాన్ని బట్టి రూ.3 వేల నుంచి రూ. 10 వేల వరకు వసూళ్లు ఉంటున్నాయి. నగర పాలక సంస్థ పరిధిలో అయితే పలు చోట్ల రూ.20 వేలు చెల్లించుకోవాల్సిందే. కావున ఆయాశాఖలు ప్రక్షాళన జరగాలని వినియోగదారులు కోరుతున్నారు.

## టిజి టెట్-2026 పోస్టర్ ఆవిష్కరించిన మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు

**- 18 నుండి రెండు రోజులపాటు ప్రత్యక్ష ప్రసారాలు**





పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మంత్రి శ్రీధర్‌బాబు, చిత్రంలో వేణుగోపాల్‌రెడ్డి, సాధిక్.

**జూబ్లీహిల్స్, నవంబరు 18, ప్రభాతవార్త:** టి-సాట్ టీజీ టెట్-2026 డిజిటల్ కోచింగ్ పోస్టర్‌ను మంగళవారం రాష్ట్ర ఐటి శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు సచివాలయంలో ఆవిష్కరించారు. డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ సచివాలయంలో జరిగిన పోస్టర్ ఆవిష్కరణ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే అభ్యర్థులకు, ఉపాధ్యాయ ఉద్యోగ పరీక్ష డీఎస్సీకి టెట్ అర్హత తప్పనిసరి కావడంతో అభ్యర్థులందరూ టి-సాట్ డిజిటల్ కంటెంట్ ద్వార సంసిద్ధులు కావాలన్నారు. ప్రభుత్వం ఉపాధ్యాయ అర్హత పరీక్షలను ప్రతీ ఏటా రెండు సీజన్లలో నిర్వహిస్తుండగా నిత్యం అందుబాటులో ఉండే టి-సాట్ నెట్వర్క్ కంటెంట్ అన్ని స్థాయిల్లో అభ్యర్థులకు ఉపయోగపడుతుందన్నారు. గత రెండు సంవత్సరాల కాలంలో మూడు టెట్ పరీక్షలు నిర్వహించిన ప్రభుత్వం, 2026 జనవరి నెలలో నిర్వహించే టెట్-2026 పరీక్ష కోసం టి-సాట్ నెట్వర్క్ స్పెషల్ డిజిటల్ కంటెంట్ అందిస్తోందని టిసాట్ సీఈవో బోదనపల్లి వేణుగోపాల్ రెడ్డి తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విద్యా శాఖకు మెరుగైన వసతుల్ని కల్పిస్తున్నారని, 11వేలకు పైగా ఉపాధ్యాయ నియామకాలు రికార్డు కాలంలో పూర్తి చేశారన్నారు. టెట్ కు హాజరయ్యే అభ్యర్థులతో పాటు ఉపాధ్యాయుల కోసం సైతం ప్రత్యేక కంటెంట్ అందిస్తున్నామన్నారు. ప్రభుత్వం ప్రకటించిన పరీక్షల తేదీలను అనుసరించి టెట్ పరీక్షలకు నవంబర్ 18, 19వ తేదీలు మంగళ, బుధవారాల్లో లైవ్ ఓరియంటేషన్‌తో పాటు మరో 44 రోజులు 200 ఎపిసోడ్స్ ప్రసారం చేయనున్నట్లు తెలిపారు. టిసాట్ నిపుణ ఛానల్‌లో సాయంత్రం 5గంటల నుండి 7 గంటల వరకు, విద్య ఛానల్లో ఉదయం 5 గంటల నుండి 7 గంటల వరకు ప్రతి రోజు నాలుగు గంటల పాటు ప్రత్యేక ప్రసారాలుంటాయన్నారు. టీచర్స్ ఎలిజబిలిటీ టెస్ట్‌కు అవసరమైన సబ్జెక్టులు చైల్డ్ డెవలప్మెంట్, సైకాలజీ, పిజికల్, బయాలాజికల్ సైన్స్, మాథ్స్, సోషల్ స్టడీస్‌తో పాటు ఇంగ్లీష్, తెలుగు ఇతర సబ్జెక్టులకు సంబంధించిన డిజిటల్ లెసన్స్ ప్రసారమతాయన్నారు. టెట్ పేపర్ 1, 2 పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థులు టి-సాట్ అందించే ప్రసారాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. టెట్ అర్హత పరీక్ష కోసం టిసాట్ నెట్వర్క్ ప్రసారం చేసే ప్రత్యేక కంటెంట్ టిసాట్ శాటిలైట్ ఛానళ్లతో పాటు, టిసాట్ యాప్, యూట్యూబ్‌లో అందుబాటులో ఉంటాయన్నారు. పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమంలో టిసాట్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సాధిక్ పాల్గొన్నారు.

## బేగంపేటలో రోడ్డు ప్రమాదం...

**-నుజ్జు నుజ్జైన థార్ కారు**
**-తప్పిన పెను ప్రమాదం..లారీ డ్రైవర్ క్లీనర్‌కు స్వల్పగాయాలు**



బేగంపేట హెచ్‌పీఎస్ ముందు కంటైనర్ ఢీకొన్న ఘటనలో నుజ్జు నుజ్జైన థార్ కార్.

**బేగంపేట నవంబరు 18,ప్రభాతవార్త** బేగంపేట పోలీసుస్టేషన్ పరిధిలో మంగళవారం ఉదయం రోడ్డు ప్రమాదం జరిగింది.ఉదయం గం 6.21నిలకు ఈ ప్రమాదం చోటు చేసుకుంది. సనత్‌నగర్ నుంచి మౌలాలీ వైపు వేగంగా ప్రయాణిస్తున్న కంటైనర్ లారీ బేగంపేట ఓల్డ్‌కస్టమ్స్ బస్తీ నుంచి రోడ్డు పైకి వచ్చిన థార్ కారు ఢీ కొట్టి హెచ్‌పీఎస్ ముందు బోల్తాకొట్టింది.ఈ సంఘటనపై బేగంపేట పోలీసుస్టేషన్‌లో కేసు నమోదైంది.పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి.సనత్‌నగర్ నుంచి మౌలాలీవైపు ప్రయాణిస్తున్న టిఎస్ 10యూబీ 5678 కంటైనర్ లారీ వేగంగా వచ్చి బేగంపేట ఓల్డ్‌కస్టమ్స్ బస్తీ నుంచి పరేడ్ గ్రౌండ్ వైపు వెళుతున్న టీజీ 10సీ 8202 నెంబర్ గల థార్ కారును వెనుక నుంచి బలంగా ఢీకొట్టింది.ఈ ప్రమాదంలో కారు వెనుక భాగం పూర్తిగా దెబ్బతింది.వేగాన్ని నియంత్రించలేక హెచ్‌పీఎస్ గేటు ముందు బోల్తాకొట్టింది.ఈ ప్రమాదంలో లారీలోని వస్తువులన్నీ నేల పాలయ్యాయి. బేగంపేట ఓల్డ్‌కస్టమ్స్ కి చెందిన మహమ్మద్ రబ్బానీ తన ఇద్దరు పిల్లలను తీసుకుని థార్ కారులో సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్ లో స్కేటింగ్ ప్రాక్టీస్ చేయించేందుకు తీసుకుని బయలు దేరాడు.అదే సమయంలో ఒక దాని వెంట ఒకటి గా రెండు కంటైనర్లు వేగంగా వస్తుండటాన్ని గమనించిన రబ్బాని తన కారును పూర్తిగా ఎడమవైపుకు కట్ చేసి రోడ్డు పక్కన నిలిపి ఉంచాడు.సైడ్ మిర్రర్‌లో చూస్తుండగా ఒక కంటైనర్ అతని వాహనాన్ని దాటుకుని వెళ్లగా రెండవ కంటైనర్ లారీ అతని వాహనాన్ని బలంగా ఢీకొంటూ కింద బోల్తాపడింది.ఈ ప్రమాదంతో కారులో బెలూన్లు ఓపెన్ అయ్యాయి.కారులో ఉన్న ఇద్దరు చిన్నారుల్లో ఒకరికి స్వల్పగాయాలు కాగా రబ్బానీ,మరో చిన్నారికి గాయాలు కాలేదు.కంటైనర్ బోల్తాపడిన ఘటనలో కంటైనర్ డ్రైవర్ సంజయ్,క్లీనర్ నీరజ్ యాదవ్‌లకు స్వల్ప గాయాలయ్యాయి.వారిని గాంధీ ఆస్పత్రికి తరలించారు.అయితే ఈ ప్రమాదం తెల్లవారుఝామున జరగడంతో పెద్ద ప్రమాదం తప్పినట్లైంది.అదే పాఠశాల ప్రారంభించే సమయంలో జరిగి ఉంటే విద్యార్థులను హెచ్‌పీ ఎస్‌లో దించేందుకు వచ్చే వాహనాలు రోడ్డుపైనే నిల్చి ఉండేవి.ప్రమాదానికి గురైన కంటైనర్ లారీ వాటిని కూడా ఢీ కొట్టి ఉంటే పెద్ద ప్రమాదం సంభవించేది.ట్రాఫిక్ కూడా తక్కువగా ఉండటంతో పెద్ద ప్రమాదం తప్పినట్లైంది.అయితే ఈ ప్రాంతంలో ప్రతి రోజు ప్రమాదాలు జరుగుతున్నాయని,సంబంధిత అధికారులు ముందస్తు జాగ్రత్త చర్యలు చేపట్టాలంటూ ఈ నెల 11వ తేదీన ,,ప్రతి రోజు ప్రమాదాలు,,ఫ్లై ఓవర్ పై నిల్చిపోతున్న ట్రాఫిక్ అంటూ ప్రభాత వార్త హైదరాబాద్ మినీలో కథనం ప్రచురితం అయింది.అయినా అధికారులు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోకపోవడంతో మంగళవారం మరో ప్రమాదం చోటు చేసుకుంది.ఇప్పటికైనా సంబంధిత శాఖ అధికారులు స్పందించాల్సిన అవసరం ఉంది.

## తమ్మిడికుంట చెరువు చుట్టూ మానవహారం

**-శేరిలింగంపల్లిలోని 64 చెరువులను సుందరంగా తీర్చిదిద్దుతాం : ఎమ్మెల్యే గాంధీ**



తమ్మిడికుంట మానవహారంలో పాల్గొన్న ఎమ్మెల్యే గాంధీ, కార్పొరేటర్ జగదీశ్వర్‌గౌడ్

**సైబరాబాద్ ప్రతినిధి, నవంబరు 18 ప్రభాతవార్త** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం, హైడ్రా ఆధ్వర్యంలో చేపడుతున్న చెరువుల పునరుద్ధరణకు మద్దతుగా మాదాపూర్ డివిజన్ కార్పొరేటర్, శేరిలింగంపల్లి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ వి. జగదీశ్వర్‌గౌడ్ ఆధ్వర్యంలో మంగళవారం మాదాపూర్ డివిజన్ పరిధిలోని తమ్మిడికుంట చెరువు చుట్టూ మానవహారం నిర్వహించారు. స్థానిక విద్యార్థులు, ప్రజలతో కలిసి దాదాపు 7వేల మంది ఈ మానవహారంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి కార్పొరేటర్ జగదీశ్వర్‌గౌడ్‌తో కలిసి తెలంగాణ పిఏసీ చైర్మన్, శేరిలింగంపల్లి నియోజకవర్గం ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గాంధీ మాట్లాడుతూ శేరిలింగంపల్లి నియోజకవర్గం పరిధిలోని 64 చెరువులను అభివృద్ధి చేసి సుందర శోభితవనంగా తీర్చిదిద్దుతామని అన్నారు. చెరువును పూర్తి స్థాయిలో అభివృద్ధి చేయడంతో పాటు మురుగు నీరు చెరువులో కలువకుండా ప్రత్యేక చర్యల ద్వారా నీటి మళ్లింపు చేపడుతామని, వర్షపు నీటిని చెరువులో చేరే విధంగా చేసి స్వచ్ఛమైన నీటితో నింపుతామని అన్నారు. చెరువుల పరిరక్షణ ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని, చెరువులను దత్తత తీసుకొని అభివృద్ధి చేసే వారు కనిపించే దేవుళ్లతో సమానమని అన్నారు. చెరువుల పునరుద్ధరణకు చర్యలు తీసుకుంటున్న రాష్ట్ర ప్రభుత్వానికి, హైడ్రాకు ధన్యవాదాలు తెలుపుతూ మానవహారం నిర్వహించడం అభినందనీయమన్నారు. కార్పొరేటర్ జగదీశ్వర్‌గౌడ్ మాట్లాడుతూ గతంతో సాగు, తాగు నీటిని అందించిన నగరంలోని చెరువులు కబ్జాలతో కనిపించకుండా పోతున్నాయని, చెరువులు అంతరించిపోతుండడంతో భూగర్భ జలాలు అడుగంటుతున్నాయన్నారు. ఈ విషయాన్ని గుర్తించిన తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చెరువుల పునరుద్ధరణ కోసం నడుం భిగించారని, హైడ్రాతో చెరువుల ఆక్రమణలను తొలగించి, పూర్తిస్థాయిలో అభివృద్ధి చేసి ప్రజలకు అందిస్తున్నారని తెలిపారు. నేడు నగరంలోని చెరువులు నిండనీటితో కళకళలాడుతున్నాయని, ముఖ్యమంత్రి నగరవాసులకు అపర భగీరథుడిగా మారాడని అన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం, హైడ్రా చేపట్టిన చర్యలకు ధన్యవాదాలు తెలుపుతూ మానవహారం నిర్వహించామని, ఇందులో ప్రజలు, విద్యార్థులు స్వచ్ఛందంగా పాల్గొనడం సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో మీడియా చైర్మన్ సామ రామ్మోహన్‌రెడ్డి, పలు పాఠశాలల విద్యార్థులు, సమీప కాలనీల ప్రజలు, కాలనీ అసోసియేషన్ సభ్యులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

## దోపిడి గ్యాంగ్ పనే..

**-పోలీసులకు చిక్కిన బ్రిలియంట్ కాలేజ్ చోరీ నిందితులు**
**-వారి నుంచి రూ. 37.05 లక్షల నగదును స్వాధీనం**
**-మరో ముగ్గురు నిందితులు పరారీలో ఉన్నట్లు గుర్తింపు**

**హైదరాబాద్,నవంబర్ 18,ప్రభాతవార్త:** హైదరాబాద్ నగర శివార్లలోని అబ్దుల్లాపూర్‌మెట్‌లోని బ్రిలియంట్ ఇంజినీరింగ్ కాలేజీలో రూ.1.07 కోట్ల నగదు చోరీకి గురైన సంగతి తెలిసిందే. ఈ కేసులో నెల రోజుల తర్వాత ముగ్గురు దొంగలు పట్టుబడ్డారు. ఈ ముగ్గురిలో ఒకరు మైనర్ ఉన్నట్లు పోలీసులు తెలిపారు. మంగళవారం ఉదయం కొత్తగూడ ఎక్స్ రోడ్డు వద్ద పోలీసులు తనిఖీలు నిర్వహించారు. అనుమానాస్పద కదలికలతో తిరుగుతున్న రాజ్ మనోహర్ పవార్(22), రితిక్ మోహితే(24), 16 ఏండ్ల బాలుడు ఉన్నారు. మరో ముగ్గురు దినేశ్ మెహితే, అరుణ్ మోహితే అలియాస్ కలూ, విలాస్ చోహన్ పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు. రాజ్ మనోహర్‌ది గుజరాత్, రితిక్‌ది మధ్యప్రదేశ్ అని పోలీసులు తేల్చారు. రితిక్ న్యాయ విద్య అభ్యసిస్తున్నట్లు తేలింది.ఈ దోపిడీ గ్యాంగ్ నగర శివార్లలోని కాలేజీలపై కన్నేసింది. ఈ క్రమంలో అక్టోబర్ 10వ తేదీన గూగుల్ మ్యాప్ ద్వారా బ్రిలియంట్ ఇంజినీరింగ్ కాలేజీని గుర్తించి, అక్కడికి వెళ్లారు. అర్ధరాత్రి వరకు అక్కడున్న చెట్ల పొదల్లో మకాం వేశారు. అనంతరం కాలేజీలోకి చొరబడి.. అల్మారాను పగులగొట్టారు. అందులో ఉన్న రూ. 1.07 కోట్ల నగదును అపహరించారు. అనంతరం దొంగలందరూ రూ. 17.8 లక్షల చొప్పున పంచుకున్నారు. రాచకొండ పోలీసులు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి దొంగల ఆచూకీ కోసం గాలించారు. మొత్తానికి ఇవాళ కొత్తగూడ ఎక్స్ రోడ్డులో దొంగలు పట్టుబడ్డారు. వారి నుంచి రూ. 37.05 లక్షల నగదును స్వాధీనం చేసుకున్నారు.

## శ్రీరామలింగేశ్వర దేవాలయంలో మంత్రి దామోదర లక్ష బిల్వార్చన పూజలు

**-ఆలయ అభివృద్ధి,పునర్నిర్మాణానికి కృషి చేస్తా**
**-మంత్రి దామోదర రాజనర్సింహా**



శ్రీరామలింగేశ్వర దేవాలయంలో పూజలు నిర్వహిస్తున్న మంత్రి దామోదర రాజనర్సింహా.

**బేగంపేట నవంబరు 18,ప్రభాతవార్త** బేగంపేట ప్రకాశంనగర్‌లోని శ్రీరామలింగేశ్వర దేవాలయంలో వైద్య, కుటుంబ,సంక్షేమ,విజ్ఞాన సాంకేతిక శాఖల మంత్రి దామోదర రాజనర్సింహ,మంగళవారం దర్శించుకుని పూజలు నిర్వహించారు.మంత్రికి కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ,శ్రీభూలక్ష్మి దేవాలయ నిర్మాణ దాత విశాల్ సుధాం మంత్రిని సాంప్రదాయ బద్ధంగా తోడ్కొని వెళ్లి పూజలు నిర్వహింపజేసారు.శాలువాలు,పూల మాలతో ఘనంగా సత్కరించారు. పూజల అనంతరం మంత్రి భక్తులు,స్థానికులతో మాట్లాడారు.ఆలయ ప్రాంగణాన్ని పరిశీలించారు.దేవాలయ అభివృద్ధి కోసం ప్రణాళికలు సిద్దం చేయాలని విశాల్ సుధాం,కాలనీ వాసులకు సూచించారు.దేవాలయ పునర్నిర్మాణం, అభివృద్ధి ఖర్చును తెలంగాణా ప్రభుత్వం భరిస్తుందని,మంత్రి దామోదర రాజనర్సింహ వారికి హామీ ఇచ్చారు.దీని ద్వారా ఆలయంలో ఆధ్యాత్మిక వాతావరణాన్ని మరింత అభివృద్ధి చేయడమేనని మంత్రి తెలియ జేసారు.ఈ కార్యక్రమంలో విశాల్‌సుధాం భక్తులు వి.చంద్రమోహన్, జే.శేఖర్, వెంకటరావు,కృష్ణ,అరుణ్‌గౌడ్,బాల,దేవాలయ ప్రధాన అర్చకులు మఠం సదాశివుడు తదితరులు పాల్గొన్నారు.

## మామ... అల్లుడు..

**-మాజీ మంత్రి తలసానిని కలిసిన ఎమ్మెల్యే నవీన్ యాదవ్**



జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే నవీన్‌యాదవ్‌ను సన్మానిస్తున్న తలసాని శ్రీనివాస్‌యాదవ్

**హైదరాబాద్,నవంబర్ 18,ప్రభాతవార్త:** రాజకీయాలు వేరైనా బంధుత్వాలు ఒక్కటేనని ఆ మామ అల్లుండ్లు నిరూపించారు. మంగళవారం తన మామ, బిఆర్‌ఎస్ మాజీమంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్‌ను కాంగ్రెస్ జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే నవీన్ యాదవ్ మర్యాద పూర్వకంగా కలిశారు. ఇటీవల జూబ్లీహిల్స్ నియోజకవర్గ ఉప ఎన్నికలలో ఎమ్మెల్యేగా గెలుపొందిన నవీన్ యాదవ్ జూబ్లీహిల్స్‌లోని తలసాని నివాసంలో కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సత్కరించారు. అదేవిధంగా తలసాని సైతం అల్లుడు నవీన్ యాదవ్‌ను సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. కాగా నవీన్ యాదవ్ భార్య తలసాని శ్రీనివాస్ యాదవ్ స్వయాన తన అన్న తలసాని శంకర్‌యాదవ్ కూతురు. దీంతో వీరిద్దరికి బంధుత్వం కొనసాగుతుంది. ఈనేపథ్యంలోనే నవీన్ యాదవ్ తలసానిని మర్యాద పూర్వకంగా కలిసి ఆశీస్సు లు తీసుకున్నాడు.

**మంత్రి పొన్నంను కలిసిన నవీన్‌యాదవ్**

మంత్రి పొన్నం ప్రభాకర్‌ను జూబ్లీహిల్స్ నియోజకవర్గం నుంచి ఉప ఎన్నికల్లో గెలుపొందిన కాంగ్రెస్ అభ్యర్థి నవీన్‌యాదవ్ మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. మంత్రుల ప్రాంగణ సముదాయంలో కలిసిన ఆయన మంత్రికి పుష్పగుచ్ఛాలను అందించారు. పొన్నంను సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు. నవీన్‌తోపాటు కాంగ్రెస్ నేతలు సాయినాథ్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## నేరాల నియంత్రణకు ప్రత్యేక నిఘా

**-రాజేంద్రనగర్ ఎసిపి శ్రీనివాస్**



**అత్తాపూర్ నవంబరు 18, ప్రభాతవార్త :** నేరాల నియంత్రణ కోసం కార్డెన్ సెర్చ్ ఎంతో ఉపయోగపడుతుందని ఎసిపి శ్రీనివాస్ పేర్కొన్నారు.రాజేంద్రనగర్ డిసిపి యోగేష్ గౌతమ్ ఆదేశాల మేరకు మంగళవారం ఉదయం ఎసిపి శ్రీనివాస్ ఆధ్వర్యంలో 150 మంది పోలీసు బృందాలు రాజేంద్రనగర్‌లోని ఎర్రబోడ,పిటి కాలనీలలో పోలీసులు పెద్ద ఎత్తున తనిఖీలు చేపట్టారు. డీసీపీ శ్రీనివాస్ ఆదేశాల మేరకు ప్రతి ఇంటిని అణువణువు గాలించారు. ఈ తనిఖీల్లో ఏలాంటి పత్రాలు లేని వాహనాలను స్వాధీనం చేసుకోవడమే కాకుండా పలువురి అనుమానితులను విచారించారు. ఈ సందర్భంగా ఎసిపి మాట్లాడుతూ.....ప్రతి ఒక్కరూ గంజాయి,డ్రగ్స్ దూరంగా ఉండాలని అసాంఘిక కార్యకాలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.రౌడీ షీటర్ల కదిలికలపై ప్రత్యేక నిఘా ఉంచడం జరిగిందని అనుమానిత వ్యక్తులు కనబడితే పోలీసులు సమాచారం ఇవ్వాలని సూచించారు.ఈ కార్యక్రమంలో సీఐలు,ఎస్‌లు,పోలీసులు పాల్గొన్నారు.

## రోడ్డుపై గోతులను మూసి వేయించాలని ఎమ్మెల్యేకు వినతి

**నార్సింగి, నవంబర్ 18 ప్రభాతవార్త :** బండ్లగూడ జాగీర్ కార్పోరేషన్ పరిధిలోని టిప్పుఖాన్ బ్రిడ్జి వద్ద నుంచి కాళీమందిర్ వరకున్న రోడ్డుపై ప్రమాదకరంగా ఉన్న గోతులకు మరమ్మత్తులు చేయాలని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్‌కు ఆల్ కాలనీ ఫెడ్రెషన్ ప్రతినిధుల బృందం వినతిపత్రంను అందజేసింది. ఈ సందర్భంగా మాజీ కార్పోరేటర్ బి.సాగర్‌గౌడ్, ఏసీఎఫ్ అధ్యక్షులు వినయ్‌రెడ్డిలు మాట్లాడుతూ రోడ్డుపై పెద్ద పెద్ద గోతులు పడడం వలన తరుచూ వాహనదారులు ప్రమాదాల పాలవుతున్నారని తెలిపారు. అనేక ప్రాంతాలలో ఎగుడు దిగుడుగా రోడ్డు ఉండడం కూడా ప్రమాదాలకు కారణమవుతుందని పేర్కొన్నారు. ఈ రోడ్డుపై జరిగిన ప్రమాదాలలో ఇప్పటి వరకు క్షతగాత్రులు అయ్యారని, ఎవరి ప్రాణాలు పోకముందే అధికార గణం కళ్ల తెరిచి మరమ్మత్తులు చేయాలని కోరుతున్నామన్నారు. ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ మా వినతి పత్రంను చదువగానే ఆర్అండ్‌బి అధికారులకు ఫోన్ చేసి, టిప్పుఖాన్ బ్రిడ్జి నుంచి కాళీ మందిర్ వరకున్న రోడ్డుపై ఉన్న గోతులు, ఎగుడు దిగుడలకు మరమ్మత్తు చేయాలని ఆదేశించారు. ఎమ్మెల్యే స్పందన పట్ల ఆల్ కాలనీస్ ఫెడ్రెషన్ ప్రతినిధులు ఆనందం వ్యక్తం చేశారు. ప్రజల సమస్యల పట్ల వేగంగా స్పందించే ఈ గుణం వల్లనే వరుసగా నాలుగుమార్లు ప్రకాశ్‌గౌడ్ ఎమ్మెల్యేగా గెలుస్తున్నారని పేర్కొన్నారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో నరేందర్‌బాబు, విజయ్ పద్మనాభం, ఆది నారాయణ తదితరులు ఉన్నారు.

## సీతారామాంజనేయ స్వామి దేవాలయం నూతన పాలకమండలి ప్రమాణ స్వీకారం



నూతన పాలకమండలి ప్రమాణ స్వీకారం నిర్వహించిన దృశ్యం

**చిక్కడపల్లి నవంబర్ 18 (ప్రభాతవార్త) :** రాంనగర్ డివిజన్ లోని దయాకర మార్కెట్ శ్రీ సీతారామాంజనేయ స్వామి దేవాలయం, మరియు శ్రీ పోచమ్మ తల్లి దేవాలయం జెమినీ కాలనీ నూతన పాలకమండలి ప్రమాణ స్వీకారం మంగళవారం జరిగింది. దేవాలయ కమిటీ నూతన ఛైర్మన్ ఊరెళ్ళి జనార్దన్ రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా లింగాల శ్రీకాంత్ గౌడ్, కోశాధికారిగా బీబీనగర్ రవి చారి, ధర్మకర్తలుగా బొల్లంపల్లి లక్ష్మణ్ రెడ్డి, కాసాల శివప్రసాద్ గౌడ్, గాండ్ల ప్రసాద్, ప్రేమ్ కుమార్, రమాకాంత్, జగపతి, బండారు జగపతి, బండారు శ్రీనివాస్, జయప్రకాష్, సలహాదారులుగా ఆర్ కల్పన యాదవ్, అత్తిలి సూర్యనారాయణ గౌడ్, పిల్లి రమేష్, గాండ్ల ప్రభాకర్ నియమితుల య్యారు. నూతన పాలకమండలి మూడు సంవత్సరాలు కొనసా గుతోంది. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు బొల్లంపల్లి రామ్ రెడ్డి, మాజీ చైర్మన్ తాండ్ర శ్రీనివాస్, మాజీ ప్రధాన కార్యదర్శి పూసరాజు, మరి కాడబోయిన లక్ష్మణ్, జి గోవింద్, జనార్ధన్ తదితర సభ్యులు పాల్గొన్నారు.

### జిహెచ్ఎంసిలో ఉద్యోగుల సమస్యలను పరిష్కారించాలి



జిహెచ్ఎంసి కమిషనర్‌కు వినతి పత్రాన్ని అందజేస్తున్న ఎఐటియుసి నేతలు

**సైఫాబాద్, నవంబరు 18 ప్రభాతవార్త:** జిహెచ్ఎంసిలో పనిచేస్తున్న ఉద్యోగుల సమస్యలను వెంటనే పరిష్కారించాలని ఎఐటియుసి రాష్ట్ర సమితి డిమాండ్ చేసింది. ఈ మేరకు మంగళవారం జిహెచ్ఎంసి ఎంప్లాయీస్ యూనియన్ ఆధ్వర్యంలో ఉద్యోగులలో కలిసి ఎఐటియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.బాల్‌రాజ్, ఉప ప్రధాన కార్యదర్శి ఎం.నర్సింహ్మా జిహెచ్ఎంసి కమిషనర్ కర్ణన్‌కు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రానికి తలమానికంగా ఉన్న జిహెచ్ఎంసి ఉద్యోగుల శ్రమ ఫలితంగా నగరం సుందరంగా అభివృద్ధి చెందుతున్నప్పటికి ఉద్యోగులకు అందవలసిన సౌకర్యాలు అందడం లేదన్నారు. ప్రభుత్వం వెంటనే పిఆర్సీని విడుదల చేసి ఉద్యోగులకు న్యాయం చేయాలని, ఉద్యోగులకు పదోన్నతులు కల్పించాలని, చనిపోయిన వారి కుటుంబ సభ్యులకు ఉద్యోగ అవకాశం కల్పించాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు కమతం యాదగిరి, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

## కల్లు దుకాణం ఏర్పాటుపై ఆందోళన

**జూబ్లీహిల్స్, నవంబరు 18, ప్రభాతవార్త:** బంజారాహిల్స్ రోడ్ నెం 12లోని ఎన్బీటీ నగర్‌లో కల్లు దుకాణం ఏర్పాటు ప్రయత్నాలపై పలువురు గౌడ సంఘం సభ్యులు బంజారాహిల్స్ పోలీసులను ఆశ్రయించారు. ఇప్పటికే చింతలబస్తీలో కల్లు దుకాణ ఏర్పాటుకు సిద్ధమవుతున్నారని, ఎన్బీటీనగర్‌లోనూ ఏర్పాటుచేసేందుకు ప్రయత్నాలు చేస్తున్నారని పోలీసుల దృష్టికి తీసుకొచ్చారు. ఏడాదిన్నర క్రితం ఎన్బీటీనగర్ కల్లు దుకాణంలో కల్తీ కల్లు విక్రయిస్తున్నారని తేలడంతో ఎక్సైజ్‌శాఖ అధికారుల దాడులు చేసి కేసు నమోదు చేశారు. ఇదే సమయంలో పోలీసులు ఈ దుకాణాన్ని మూసేశారు. ఇదే కాకుండా చింతల్ బస్తీలోని కల్లు దుకాణం సైతం మూతపడింది. తాజాగా కొందరు సభ్యులు ఏకపక్షంగా కొందరు ఎక్సయిజ్ అధికారులను ప్రసన్నం చేసుకొని చింతల్ బస్తీలోని కల్లు దుకాణాన్ని తాత్కాలికంగా తెరిచేందుకు అనుమతి పత్రాలను పొందారు. విషయం తెలుసుకున్న మిగిలిన సభ్యులు సభ్యుల దొంగ సంతకాలతో తీర్మానం చేసి అనుమతులు పొందారంటూ ఇతర సభ్యులు ఎక్సయిజ్ కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఈ వ్యవహారంపై దృష్టిం సారించాలని ఇప్పటికే కమిషనర్ కింది స్థాయి అదికారులను ఆదేశించారు. ఇదిలా ఉండగా చింతలబస్తీతోపాటు ఇప్పుడు ఎన్బీటీనగర్ కల్లు దుకాణం సైతం తెరవడానికి అదే కమిటీ సభ్యులు ప్రయత్నిస్తున్నారని, వారిని అడ్డుకోవాలంటూ గౌడం సంఘం అధ్యక్షుడు బాలరాజుగౌడ్, కోశాధికారి శ్రీనివాస్‌గౌడ్‌లు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దొంగ కమిటీతో అనుమతులు తీసుకున్నారంటూ పోలీసులకు మోఖికంగా ఫిర్యాదు చేశారు. తమ సొసైటీ మాత్రమే నిజమైన సొసైటీ అని, గీత కార్మికుల హక్కులను కాలరాస్తూ కాంట్రాక్టర్ విధానంలో కొం తమంది కల్లు దుకాణాన్ని నడిపించేందుకు ప్రయత్నాలు చేస్తే తాము అడ్డుకుంటామని, అలాంటి వారికి అనుమతి ఇవ్వవద్దన్నా రు. ఒకవేళ ఇస్తే తాము అక్కడే విక్రయాలు చేస్తామని వారు స్పష్టం చేశారు.

## నేటి నుంచి సాలార్‌జంగ్ మ్యూజియంలో వరల్డ్ హెరిటేజ్ వారోత్సవాలు

**చార్మినార్, నవంబరు 18 ప్రభాతవార్త :** హైదరాబాద్ పాతబస్తీ నయాపూల్‌లో ఉన్న సాలార్‌జంగ్ మ్యూజియంలో ఈ నెల 19 నుంచి 25వ తేదీ వరకు వరల్డ్ హెరిటేజ్ వారోత్సవాలను సాలార్ జంగ్ మ్యూజియం, సృష్టి ఫౌండేషన్‌ల సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించనున్నామని సాలార్‌జంగ్ మ్యూజియం క్యూరేటర్ ఆర్.బి.నాయక్ తెలిపారు. ప్రపంచ హెరిటేజ్ వారోత్సవాలు సందర్భంగా మ్యూజియంలో ప్రత్యేక ఫోటో ప్రదర్శనను ఏర్పాటు చేస్తున్నామని ఆయన తెలియజేశారు. ప్రత్యేక ఫోటో ప్రదర్శనలో చారిత్రక కట్టడాలకు సంబంధించిన వంద చిత్రాలను ప్రదర్శనలో నెల కొల్పుతున్నామని ఆయన తెలిపారు. ఈ నెల 19వ తేదీ బుధవారం సాయంత్రం నాలుగు గంటలకు ప్రపంచ హెరిటేజ్ వారోత్సవాలు మ్యూజియంలో ప్రారంభమవుతాయని ఆయన తెలియజేశారు. నవంబరు నెల 25 వ తేదీ వరకు ఫోటో ప్రదర్శన కొనసాగుతుందని ఆయన తెలిపారు.

## పోక్సో చట్టంపై విద్యార్థులలో విస్తృతంగా అవగాహన కలిగించాలి

**-హోం గార్డ్స్ స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్ అదనపు డీజీపీ స్వాతి లాక్రా**



కార్యక్రమంలో పాల్గొన్న హోం గార్డ్స్ స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్ అదనపు డీజీపీ స్వాతి లాక్రా, డాక్టర్ సరోజ వివేక్, డాక్టర్ సృజన తదితరులు

**చిక్కడపల్లి నవంబర్ 18 (ప్రభాతవార్త) :** పోక్సో చట్టంపై విద్యార్థులలో విస్తృతంగా అవగాహన కలిగించాల్సిన అవసరం ఉందని హోం గార్డ్స్ స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్ అదనపు డీజీపీ స్వాతి లాక్రా అన్నారు. మంగళవారం బాగ్ లింగంపల్లి డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ లా కాలేజ్ ఆధ్వర్యంలో "పోక్సో చట్టంపై సంప్రదింపులు: ఒక న్యాయ అవగాహనా కార్యక్రమం"ను నిర్వహించారు. ఈ కార్యక్రమం పిల్లలను లైంగిక దాడుల నుండి రక్షించే చట్టం గురించి అవగాహన పెంపొందించడం, అమలుపై చర్చించడం లక్ష్యంగా కలిగి ఉంది. ఈ కార్యక్రమాన్ని అంబెద్కర్ విద్యాసంస్థల కరెస్పాండంట్ డాక్టర్ సరోజా వివేకానంద్, బి.ఆర్. అంబేద్కర్ లా కాలేజ్ ప్రిన్సిపాల్ డాక్టర్ డి. సృజన ప్రారంభించారు. అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ అల్లూరి రామ్ రెడ్డి, నార్త్ జోన్ ఆదనపు డీసీపీ డాక్టర్ అశోక్ పగడాల, కంపాస్ లా అసోసియేట్స్ సిఈఓ ప్రియా అయ్యంగార్, తారుణి డైరెక్టర్ డాక్టర్ మమతా రఘువీర్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కంపాస్ లా అసోసియేట్స్ , తారుణి సంయుక్తంగా స్థాపించిన స్నేహధారా పోక్సో లా సెంటర్ ను ప్రారంభించారు. ఈ కేంద్రం పోక్సో సంబంధిత కేసులకు ప్రత్యేక న్యాయ సహాయం, మార్గదర్శకత అందించడానికి ఏర్పాటు చేయబడింది. కార్యక్రమంలో పోక్సో చట్టానికి సంబంధించిన న్యాయ, మానసిక. విధాన పరమైన అంశాలపై నిపుణులు చర్చలు నిర్వహించారు. పోక్సో కేసులను నిర్వహించడంలో ఎదురయ్యే సవాళ్లు, ఉత్తమ పద్ధతులు, బాలల రక్షణలో రంగాల మధ్య సమన్వయం పెంపొందించడంపై కూడా చర్చలు జరిగాయి. ప్రశ్నోత్తరాలు, కేసు అధ్యయనాలు కూడా కార్యక్రమంలో భాగంగా నిర్వహించబడ్డాయి. ఈ కార్యక్రమం పోక్సో చట్టంపై అవగాహనను మరింతగా పెంచి, సమాజంలో నమ్మకాన్ని బలపరచి, బాలల రక్షణ కోసం నిరంతర సహాయాన్ని అందించగల ఒక ముఖ్యమైన కేంద్రాన్ని ప్రారంభించింది. ఇది పిల్లలు, బాధితులు మరియు వారి కుటుంబాలు న్యాయ పరిరక్షణ మరియు సహాయం పొందడంలో ఎంతో ఉపయోగకరంగా నిలిచింది.

## కాంగ్రెస్ పార్టీకి బీహార్‌లో పట్టినగతే పడుతుంది

**- బిసి ప్రజాప్రతినిధులు రాజీనామా చేయాలి**
**-డిసెంబర్‌లో జరిగే ప్రజాపాలన వారోత్సవాలను అడ్డుకుంటాం**



బీసీ పొలిటికల్ ప్రంట్ కార్యాలయంలో మాట్లాడుతున్న బాలగౌని బాలరాజ్‌గౌడ్, చిత్రంలో అయిలి వెంకన్నగౌడ్, యెలికట్టే విజయకుమార్‌గౌడ్, అంబాల నారాయణగౌడ్ తదితరులు

**హైదరాబాద్, నవంబరు 18 ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్ర మంత్రివర్గ నిర్ణయాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని బీసీ సమాజానికి ప్రభుత్వం బహిరంగ క్షమాపణ చెప్పాలని బీసీ పొలిటికల్ ప్రంట్ చైర్మన్ బాలగౌని బాలరాజ్ గౌడ్ డిమాండ్ చేశారు. మంగళవారం చిక్కడపల్లిలోని పొలిటికల్ ప్రంట్ రాష్ట్ర కార్యాలయంలో కన్వీనర్ అయిలి వెంకన్నగౌడ్, యెలికట్టే విజయకుమార్‌గౌడ్, అంబాల నారాయణ గౌడ్‌లతో కలిసి ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పార్టీ పరంగా 42 రిజర్వేషన్లతో స్థానిక ఎన్నికలకు వెళ్తామని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ప్రకటించడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామన్నారు. ఆయన మాటల్లో 15వ ఫైనాన్స్ కమీషన్ నుంచి రావాల్సిన 3 వేల కోట్ల నిధుల కోసమే ఎన్నికలు నిర్వహిస్తున్నామని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. ఇది బీసీల ఆత్మగౌరవాన్ని దెబ్బతీయడమే అన్నారు. బీసీలకు ప్రతియేటా సబ్‌ప్లాన్ నుంచి 20 వేల కోట్లు ఇస్తామని చెప్పారని రెండేళ్ళలో రావాల్సిన 40 వేల కోట్లను వెంటనే విడుదల చేయాలని వారు డిమాండ్ చేశారు. 42 శాతం రిజర్వేషన్లు ఇచ్చాకే ఎన్నికలకు పోతామని చెప్పి ఉత్తుత్తా జీవోలు ఇచ్చి బీసీలను మోసం చేస్తున్నారని విమర్శించారు. ఇప్పుడు ఎన్నికలు నిర్వహించడం అంటే బీసీలను అధికారానికి దూరం చేయడమే అన్నారు. కాంగ్రెస్ పార్టీలో ఉన్న ప్రజా ప్రతినిధులందరూ రాజీనామా చేసి బయటికి రావాలని కోరారు. బీసీలకు కోర్టు ఆదేశం మేరకు 18 శాతం రిజర్వేషన్ ఉందని అయితే ప్రభుత్వం పార్టీ పరంగా 42 శాతం ఇచ్చి గ్రామ పంచాయితీ ఎన్నికలు నిర్వహిస్తామని చెప్పున్నారని అయితే పార్టీ గుర్తు లేకుండా ఏ ప్రాతిపదికన ఎన్నికలు నిర్వహిస్తారని వారు ప్రశ్నించారు. ఇది బీసీ వ్యతిరేకపాలన అని విమర్శించారు. డిసెంబర్ 1 నుంచి 9వరకు జరిగే ప్రజా పాలన వారోత్సవ సంబరాలను అడుగడుగున అడ్డుకుంటామని వారు హెచ్చరించారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి చట్టబద్ధంగా రిజర్వేషన్ కల్పించేందుకు పార్లమెంట్లో చట్టం చేసేలా కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని, లేకుంటే కాంగ్రెస్ పార్టీకి బీహార్‌లో పట్టినగతే పడుతుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు బైరు శేఖర్ గంగపుత్ర, దామోదర్ తదితరులు పాల్గొన్నారు.

## ఇంటర్మీడియట్ బోర్డులో సంస్కరణలు శుభపరిణామం

**-సిఎం రేవంత్‌రెడ్డికి ఉద్యోగుల సంఘం కృతజ్ఞతలు**



ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడుతున్న ఉద్యగుల సంఘం ప్రతినిధులు

**హైదరాబాద్, నవంబర్ 18, ప్రభాతవార్త:** రైజింగ్ తెలంగాణ నినాదంతో విద్యా వ్యవస్థను బలోపేతం చేస్తున్న సిఎం రేవంత్ రెడ్డికి ఇంటర్మీడియట్ బోర్డు ఉద్యోగుల సంఘం కృతజ్ఞతలు తెలిపింది. ఈ మేరకు మంగళవారం సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సంఘం అధ్యక్షులు జగదీశ్వర్ రెడ్డి మాట్లాడుతూ...ముఖ్యమంత్రి దిశానిర్దేశాల మేరకు బోర్డులో పలు పరిపాలనా సంస్కరణలు అమలు కావడం పట్ల హర్షాన్ని ప్రకటించారు. ఈ ఆఫీస్ అమలు వల్ల ఇంటర్మీడియట్ బోర్డు పూర్తిగా ఈ ఆఫీస్ విధానంలోకి మారిందన్నారు. కార్యక్రమాల ఫైళ్లన్నీ డిజిటల్ విధానంలోనే నడుస్తుండడంతో పారదర్శకత, వేగం పెరిగినట్టు తెలిపారు. నిధుల నిర్వహణకు ఎటువంటి బడ్జెటరీ సపోర్ట్ లేకున్నా, ప్రభుత్వం ఎంపానెల్ బ్యాంకుల్లో ఎఫ్ డి రూపంలో నిధులను పెట్టుబడి పెట్టి బోర్డు ఆర్థిక వ్యవస్థను సుస్థిరపరచినట్లు తెలిపారు. ఫిబ్రవరి పరీక్షల దృష్ట్యా ఉన్నతాధికారుల కమిటీ సిఫార్సుల మేరకు టిజిఈడబ్ల్యు ఐడిసి ద్వారా మరమ్మత్తులు చేయించారని ఆయనవెల్లడించింది. సిసిటివి పర్యవేక్షణ కమాండ్ కంట్రోల్ సెంటర్‌ల ద్వారా ప్రశ్న పత్రాల లీకేజీలను అరికట్టేందుకుచర్యలు చేపట్టడం అభినందనీయమన్నారు. 2 నెలల ముందే పరీక్షలు నిర్వహణ కార్యక్రమాలను నిర్వహించి 70,000 మంది విద్యార్థులకు జీవిత నైపుణ్యాలు, మానసిక ఒత్తిడిని అధిగమించెందుకు శిక్షణను అందిస్తున్నారాని 2026ఇంటర్మీడియట్ పరీక్షలనుపూర్తిస్థాయి పారదర్శకతతో నిర్వహించేందుకు సిద్ధంగా ఉన్నామని అధికారులు వెల్లడించారు.

### గల్ఫ్ వలసదారుల సాధికారత కోసం నైస్ యాప్ : విశ్రాంత ఐఎఫ్ఎస్ వినోద్ కుమార్

**హైదరాబాద్, నవంబర్ 18, ప్రభాతవార్త:** గల్ఫ్ వలసదారుల సాధికారత కోసం నైస్ యాప్‌ను విడుదల చేశారు. ఈ మేరకు నైస్ ఫౌండర్ రంగయ్య చౌదరి ఆధ్వర్యంలో మంగళవారం సోమాజిగూడ ప్రెస్ క్లబ్ లో నిర్వహించిన కార్యక్రమంలో విశ్రాంత ఐఎఫ్ఎస్ వినోద్ కుమార్, భీమ్ రెడ్డి, మచ్చ శ్రీనివాస్ పాల్గొని ఆవిష్కరించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ గల్ఫ్ దేశాల్లో తెలుగు రాష్ట్రాల నుండి దాదాపు14 లక్షల మందినివసిస్తున్నరన్నారు. భారతీయ వలసదారుల కోసం ప్రత్యేకంగా రూపొందించిన నైస్(నెట్ వర్కింగ్ ఫర్ ఇమిగ్రేంట్ కేర్ ఎంపవర్మెంట్)యాప్‌ను పరిచయం చేయడం అభినందనీయమన్నారు. వలసదారులు ఎదుర్కొనేసాంస్కృతి, భాషా, విద్యా, వ్యవస్థాగత అడ్డంకులను అధిగమించేందుకు ఈ వేదిక ముఖ్యమైన పాత్రపోషించనుందన్నారు. ప్రతివలసదారుడు మనుగడ నుంచి అభివృద్ధి దిశగా ఎదగేందుకు అవసరమైన సహాయకవాతావరణం అందించడం కోసం ఈ యాప్ ఉద్దేశమని రంగయ్య చౌదరి తెలిపారు. వలసదారులకు సేవలు, వనరులు, అవకాశాలతో అనుసంధానించి, కొత్త దేశంలో స్వీయ నిర్ణయం, ధైర్యం, స్వయంసాధికారతను పెంపొందించడానికి కృషి చేస్తామన్నారు.

స్థానికంగా ఉన్న ఇతర భారతీయ వలసదారులతో పరిచయాలు, ఎంబసీ, పోలీసు, అత్యవసర సేవలపై సమాచారం, టెలిమెడిసిన్ అందించే వైద్యుల నెట్‌వర్క్, ఆర్థిక అక్షరాస్యత, భాషా అభ్యాసం, మానసిక ఆరోగ్యం వంటి సుసంపన్న వనరులు పొందెందుకు అవకాశం ఉంటుందన్నారు

### డాక్టర్‌లు రాసిచ్చిన మందులను రోగులు తప్పకుండా వాడాలి




అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న వైద్యులు

**సికింద్రాబాద్, నవంబర్ 18 ప్రభాతవార్త:** వరల్డ్ యాంటీబయాటిక్ వారోత్సవాలను పురస్కరించుకొని మంగళవారం సికింద్రాబాద్ గాంధీ మెడికల్ కళాశాలలో నిర్వహించిన అవగాహన సదస్సుకు మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఇందిరా ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమే మాట్లాడుతూ వివిధ రోగాల కోసం డాక్టర్లను సంప్రదించే రోగులు డాక్టర్లు వ్రాసిన ఆంటీబయాటిక్ ఇచ్చిన ప్రిస్క్రిప్షన్ వాడాలన్నారు. డాక్టర్లు ఇచ్చిన కోర్సు పూర్తయ్యే వరకు డిస్క్రిప్షన్ లో వాడుకోవాలన్నారు మధ్యలో ఆపకూడదన్నారు. ఆంటీబయాటిక్ ప్రిస్క్రిప్షన్ను మధ్యలో నిలిపివేస్తే జబ్బు నయం కాకపోవచ్చు తెలిపారు. డిస్క్రిప్షన్స్‌లో రాసిన మందులను పూర్తిస్థాయిలో తప్పనిసరిగా వాడాలన్నారు. డాక్టర్లను సంప్రదించకుండా మెడిసిన్స్ కావాలని వచ్చే రోగులకు ఫార్మసిస్టులు మందులను ఇవ్వకూడదన్నారు. ఈ కార్యక్రమంలో గాంధీ మెడికల్ కళాశాల మైక్రో బయాలజీ విభాగం హెచ్ఓడి డాక్టర్ సురేఖ, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ బ్రహ్మేశ్వర్, అసిస్టెంట్ ప్రొఫెసర్ రమేష్ గాంధీ మెడికల్ కళాశాల పిజి మైక్రో బయాలజీ విభాగం విద్యార్థులు అదేవిధంగా అండర్ గ్రాడ్యుయేట్స్ విద్యార్థులు పాల్గొన్నారు

### రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

**పేట్ బషీరాబాద్, నవంబర్ 18, ప్రభాతవార్త**

రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన పేట్ బషీరాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఫతేనగర్‌కు చెందిన శ్యామ్‌కుమార్ మండల్ (35) గిర్మాపూర్, మేడ్చల్‌లో బిజినెస్ ఫ్రెష్ ప్రొడక్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీలో మేనేజర్‌గా పనిచేస్తున్నాడు. కాగా 17/11/2025 రాత్రి శ్యామ్‌కుమార్ రోజువారీ విధులు ముగించుకుని ఇంటికి తన స్కూటీపై గుండ్లపోచంపల్లి - కొంపల్లి రోడ్డు మీదగా వెళ్తున్నాడు. మార్గమధ్యలో చాయి కేఫ్ బంక్, గుండ్లపోచంపల్లి దగ్గరలో సుమారు 10:45 గంటల సమయంలో ఒక జెసిబి వాహనం రోడ్డు మీద ఎటువంటి హెచ్చరిక సూచనలు లేకుండా నిరక్ష్యంగా నిలపడంతో, అట్టి జెసిబి చీకటిలో కనపడక, శ్యామ్‌కుమార్ తన వాహనం నియంత్రణ తప్పి జెసిబికి ఢీ కొనడం వలన తీవ్ర గాయాలపాలై అక్కడికక్కడే మరణించాడని తెలిపారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## అందరం స్వచ్ఛందంగా మాదకద్రవ్యాలకు దూరంగా ఉందాం

**- నార్సింగి మున్సిపల్ కమిషనర్ కృష్ణమోహన్‌రెడ్డి**



నార్సింగి గురుకుల పాఠశాలలో "నషా ముక్త్ భారత్-కుశాల్ భారత్" కార్యక్రమంను నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థుల దృశ్యం

**నార్సింగి, నవంబర్ 18 ప్రభాతవార్త :** అందరం స్వచ్ఛందంగా మాదక ద్రవ్యాలకు దూరంగా ఉందామని "నషా ముక్త్ భారత్" లో భాగస్వాములం అవుదామని నార్సింగి మున్సిపల్ కమీషనర్ కృష్ణమోహన్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం నార్సింగి మున్సిపాలిటీలోని సాంఘీక గురుకుల పాఠశాల, మున్సిపల్ కార్యాలయాలలో "నషా ముక్త్ భారత్-కుశాల్ భారత్" కార్యక్రమంను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కమీషనర్ కృష్ణమోహన్‌రెడ్డి మాట్లాడుతూ గుట్కా, సిగరేట్, మద్యం, డ్రగ్స్ వంటివి సేవించడం వలన మన ఆరోగ్యం వేగంగా క్షీణిస్తుందని, భయంకరమైన క్యాన్సర్ రోగాల పాలవుతామని హెచ్చరించారు. ముఖ్యంగా యువత ఇలాంటి దురలవాట్లకు దూరంగా ఉండాలని సూచించారు. ఏ దేశం ప్రగతి అయినా యువ శక్తిపైనే ఆధారపడి ఉంటుందని, యువతరంను మాదక ద్రవ్యాలకు దూరంగా ఉంచాలన్న సదుద్దేశంతోనే ప్రభుత్వం "నషా ముక్త్ భారత్-కుశాల్ భారత్" కార్యక్రమంను ఉద్యమంగా తీసుకొని అన్ని విద్యాలయాలలో విద్యార్థులకు అవగాహన కల్పిస్తుందని తెలిపారు. తల్లిదండ్రులు తమ బిడ్డలను, ఉపాధ్యాయులు తమ విద్యార్థులను మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండేలా జాగరూకులను చేయాలని సూచించారు. సరైన గైడెన్స్ లేకనే చేతికి అంది వచ్చిన యువత చెడు దారిలో వెళ్లి, మాదకద్రవ్యాలకు బానిసలుగా మారి మరణిస్తున్నారని, ఈ విషయంపై తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలని, తమ బిడ్డలను సరైన దారిలో నడిపించాలని కమీషనర్ కృష్ణమోహన్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మేనేజర్ నాగేంద్రబాబు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

## తెలుగు చిత్ర పరిశ్రమలో మూడో కన్ను కాంతారావు



వంశీ ఆర్ట్స్ థియేటర్స్ నిర్వహణలో విఖ్యాత నటుడు కాంతా రావు 102 వ జయంతి కార్యక్రమాన్ని నిర్వహించిన దృశ్యం

**చిక్కడపల్లి నవంబర్ 18 (ప్రభాతవార్త) :** నాడు తెలుగు చిత్ర పరిశ్రమకు యెన్ టి ఆర్ ఏ యెన్ ఆర్ రెండు కళ్ళు కాగా కాంత రావు మూడవ కన్ను అని ప్రముఖ సినీ దర్శకుడు రేలంగి నరసింహారావు అన్నారు. మంగళవారం త్యాగరాయ గాన సభలోని కళా దీక్షితులు కళా వేదిక పై వంశీ ఆర్ట్స్ థియేటర్స్ నిర్వహణలో విఖ్యాత నటుడు కాంతా రావు 102 వ జయంతి సందర్భంగా కాంతా రావు నటించిన సినిమా పాటలు వై ఎస్ రామ కృష్ణ బృందం ఆలపించారు అనంతరం జరిగిన సభా కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న రేలంగి నరసింహ రావు మాట్లాడుతూ పాత తరం మహా నీయుల చరిత్ర మరుస్తున్న కాలంలో వంశీ వంటి సంస్థలు వారిని గుర్తు చేస్తున్నారు అని ప్రశంసించారు క్రమ శిక్షణ అంకిత భావం కాంతా రావు నుంచి నేర్చుకున్నాను అని చెప్పారు అధ్యక్షత వహించిన ప్రముఖ సాహితీ వేత్త డాక్టర్ వోలేటి పార్వతీశం మాట్లాడుతూ తెలంగాణ నుంచి వచ్చి ఆ రోజులో ఎదిగిన ఏకైక హీరో కాంతా రావు అన్నారు ఆయన సాంఘీక జానపద పౌరాణిక సినిమా లలో నటించి మెప్పించారు అన్నారు నారద పాత్ర లో ఆయనను మించిన నటుడు లేరు అన్నారు వంశీ రామరాజు అధ్యక్షత వహించిన సభలో గాయని రాధా రాణి దంపతులు కాంత రావు కుమారుడు రాజాకు నగదు పురస్కారం అందజేశారు రచయిత్రి డాక్టర్ కృష్ణ కుమారి తనకు కాంతా రావు తో ఉన్న అనుబంధం గుర్తు చేసుకున్నారు వేదిక పై సుధామయి సుంకర పల్లి శైలజ తదితరులు పాల్గొన్నారు.

### సైబర్ క్రైమ్‌పై పాతబస్తీ ప్రజలకు అవేర్‌నెస్ కార్యక్రమం




సమావేశంలో మాట్లాడుతున్న బండ్లగూడ ఇన్‌స్పెక్టర్ దేవేందర్

**చార్మినార్, నవంబరు 18 ప్రభాతవార్త :** పాతబస్తీ ఇంద్రానగర్ లోని ప్రజలకు మంగళవారం బండ్లగూడ పోలీస్ పోలీసులు సైబర్ క్రైమ్‌పై అవేర్ నెస్ క్యార్యక్రమాన్ని నిర్వహించారు. సమావేశంలో పాల్గొన్న బండ్లగూడ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ దేవేందర్ మాట్లాడుతూ ప్రజలు సైబర్ క్రైమ్ పట్ల చాలా జాగ్రత్తగా ఉండాలని తెలిపారు. అనుమానం వస్తే వెంటనే ప్రజలు పోలీసులకు ఫిర్యాదు చేయాలని ఆయన తెలియజేశారు. సైబర్ నేరాలపై పోలీసులు ఇంద్రానగర్ ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో బండ్లగూడ పోలీస్ స్టేషన్ ఎస్ఐలు నాగరాజురెడ్డి, మహేందర్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.

### గోశాలలో 23న అన్నకూట్ ప్రసాదం

**చార్మినార్, నవంబరు 18 ప్రభాతవార్త :** కార్వాన్‌లోని జగద్గురు సమర్థ కామధేను గోశాలలో ఈ నెల 23వతేదీనఅన్న కూట్ ప్రసాదం కార్యక్రమాన్ని నిర్వహించనున్నామని గోశాలకు చెందిన పురుషోత్తం గుప్తా తెలిపారు. ఆదివారం మధ్యాహ్నం 1 నుంచి సాయంత్రం ఐదు గంటలు వరకు గోశాలలో అన్నకూట్ ప్రసాదం కార్యక్రమం జరుగుతుందని ఆయన తెలియజేశారు. నారాయణ ఆశ్రమం పన్నెండువ పీఠాధిపతి శ్రీ ప్రభుదత్ మహారాజ్‌తో పాటుపలువురు కార్యక్రమంలో పాల్గొంటున్నారని పురుషోత్తం గుప్తా తెలిపారు.

### క్రీడాలకు ప్రభుత్వం అన్ని విధాలుగా గుర్తింపు తీసుకువస్తుంది



క్రీడాకారులను బహుమతులను ప్రదానం చేస్తున్న రోహిన్‌రెడ్డి, మెట్టు సాయికుమార్

**సైఫాబాద్, నవంబరు 18 ప్రభాతవార్త:** సబ్ జూనియర్ నేషనల్ జూడో ఛాంపియన్‌షిప్ పోటీలు మంగళవారం ఎల్‌బి స్టేడియంలో అట్టహాసంగా ప్రారంభమైనాయి. 3 రోజులపాటు ఇండోర్ స్టేడియంలో ఈ పోటీలు జరగనున్నాయి. తెలంగాణ జూడో అసోసియేషన్ ఛైర్మన్ మెట్టు సాయికుమార్, జూడో అసోసియేషన్ అధ్యక్షుడు కైలాష్‌యాదవ్ ఈ పోటీలను ప్రారంభించారు. ఈ పోటీలలో కేంద్ర పాలిత ప్రాంతాలతోపాటు పలు రాష్ట్రాలకు చెందిన క్రీడాకారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మెట్టు సాయికుమార్ మాట్లాడుతూ రాష్ట్రంలో పెద్ద ఎత్తున ప్రభుత్వం యువ క్రీడాకారులకు మంచి అవకాశం కల్పిస్తున్నదని, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో అన్ని క్రీడలతోపాటు జూడో క్రీడాకు కూడా గుర్తింపు తీసుకువస్తామన్నారు. ఈ సందర్భంగా విజేతలకు రోహిన్‌రెడ్డి బహుమతులను ప్రదానం చేశారు.

### ప్రభుత్వ పాఠశాలలో నషా ముక్త్ భారత్ అభియాన్




మాదకద్రవ్యాల నిరోధక ప్రతిజ్ఞ కార్యక్రమంలో పాల్గొన్న కమిషనర్

**కొంపల్లి, నవంబర్ 18, ప్రభాతవార్త :** కొంపల్లి పురపాలక సంఘ కమిషనర్ ఎన్ కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో కొంపల్లి ప్రభుత్వ పాఠశాల ఆవరణలో నషా ముక్త్ భారత్ అభియాన్ మాదకద్రవ్యాల నిరోధక ప్రతిజ్ఞ కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ మాట్లాడుతూ పిన్న వయస్కులైన పాఠశాల పిల్లలు ఈ డ్రగ్స్‌కి ఎలా అలవాటు పడుతున్నారు, అలవాటు పడడంతో వచ్చే పరిణామాల గురించి తెలియజేశారు. ఈ కార్యక్రమానికి మునిసిపల్ డి.ఈ.ఈ తిరుపతి, మునిసిపల్ మేనేజర్ సి.హెచ్.శ్రీనివాస్ గౌడ్, కొంపల్లి ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయులు కృష్ణా, పెట్ బషీరాబాద్ పోలీస్ స్టేషన్ ఎస్‌హెచ్ఓ, రెవిన్యూ ఇన్స్పెక్టర్ రాజు, సానిటరీ ఇన్స్పెక్టర్ కే. పర్శురామ్, ఎన్విరాన్మెంట్ ఇంజనీర్ రాఘవాచారి, వార్డ్ ఆఫీసర్స్, బిల్ కలెక్టర్లు, పాఠశాల సిబ్బంది, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

### మత్తు పదార్థాల నిర్మూలనపై అవగాహన సదస్సు




**కొంపల్లి, నవంబర్ 18, ప్రభాతవార్త** యువతను పెడదారి పట్టిస్తున్న మత్తు పదార్థాల నిర్మూలనకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని బాచుపల్లి సిఐ సతీష్ కుమార్ పిలుపునిచ్చారు. సోమవారం రాత్రి నిజాంపేట్ రాజీవ్ గృహకల్ప వద్ద రాష్ట్ర సేవాలాల్ సేన ప్రధాన కార్యదర్శి రామచంద్ర నాయక్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన మత్తు పదార్థాల నిర్మూలన అవగాహన సదస్సులో సిఐ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటి యువత గంజాయి, కొకయిన్, డ్రగ్స్, మద్యం లాంటి మత్తు పదార్థాల భారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. తెలిసి తెలియని వయసులో మత్తు పదార్థాలకు బానిసలై జీవితాలు నాశనం చేసుకోవద్దని ఆయన సూచించారు. పరిసర ప్రాంతాలలో మత్తుపదార్థాల క్రయవిక్రయాలను జరిపే వారి పట్ల కఠినంగా శిక్షిస్తామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమాన్ని మేడ్చల్ జిల్లా సేవాలాల్ సేన అధ్యక్షుడు నాగరాజు నాయక్, రామచంద్రనాయక్‌ల ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో సేవలాల్ సేన రాష్ట్ర అధ్యక్షుడు రాంబాబు నాయక్, వివిధ రాజకీయ పార్టీలకు చెందిన వక్తలు, స్థానిక బస్తీల పెద్దలు ప్రసంగించారు. పెద్ద సంఖ్యలో స్థానికులు కార్యక్రమానికి హాజరయ్యారు.

### అభివృద్ధి పనులు ప్రారంభించిన కార్పొరేటర్



అభివృద్ధి పనులు ప్రారంభిస్తున్న కార్పొరేటర్ రాజ్ జితేంద్ర నాథ్

**అల్వాల్, నవంబర్ 18 ప్రభాతవార్త:** అల్వాల్ సర్కిల్ మచ్చ బొల్లారం 133 డివిజన్ రాయల్ ఎంక్లేవ్ రోడ్ నెంబర్ 7 లో సీసీ రోడ్డు పనులను స్థానిక కార్పొరేటర్ రాజ్ జితేంద్ర నాథ్ కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. ఈ సందర్భంగా కాలనీ వాసులతో కలిసి కాలనీ లో పర్యటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాయల్ ఎంక్లేవ్ లో ఈరోజు దాదాపు 10 లక్షల వ్యయం తో సీసీ రోడ్డు పనులను ప్రారంభించామని తెలిపారు. మచ్చ బొల్లారం డివిజన్ మల్కాజిగిరి నియోజకవర్గంలో చాలా పెద్ద డివిజన్ అని, ఇక్కడ మైనంపల్లి హనుమంతరావు సహకారం తో ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేశామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు బొబ్బిలి సురేందర్ రెడ్డి, శ్రీశైలం యాదవ్, వెంకటేష్, శ్రీనివాస్ గౌడ్, ఆనంద్, లద్దు రెడ్డి, సంపత్ యాదవ్ మరియు కాలనీ వాసులు శ్రీనివాస్ రెడ్డి, సుకూర్ , భాస్కర్ రెడ్డి, అనిల్ రెడ్డి, సురేందర్ రెడ్డి ,ప్రభాకర్ రెడ్డి ,విజయ్ రెడ్డి, శారద, లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

## మక్కా మదీనాలో ప్రాణాలు కోల్పోయిన వారికి టిఎన్‌జిఓ ప్రతినిధులు నివాళి

**గోషామహల్, నవంబర్ 18ప్రభాతవార్త:** మక్కా, మదీనాలో రోడ్డు ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన45మంది హైదరాబాద్ వాసులకు ఆత్మకు శాంతి కలుగాలని తెలంగాణ నాన్‌గజిటెడ్ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో నివాళ్లు అర్పించారు. ఈకార్యక్రమాన్ని తెలంగాణ నాన్ గజిటెడ్ ఆఫీసర్స్ యూనియన్ హైదరాబాద్ జిల్లా కార్యాలయంలో నిర్వహించారు. టిఎన్‌జిఓ సెంట్రల్ యూనియన్‌ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎస్.ఎం. ముజీబ్‌హుస్సేనీ, హైదరాబాద్ జిల్లా యూనియన్ అధ్యక్షులు విక్రమ్‌కుమార్, జిల్లా కార్యదర్శి కుర్రాడి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్ని ప్రమాద మృతుల కుటుంబాలకు తమ ప్రగాడ సానుభూతిని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పందించి ప్రమాదబాధితులకు తక్షణమే స్పందించి 5లక్షల రూపాయల ఎక్స్‌గ్రేషియా ప్రకటించడం పట్ల ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ అంశాన్ని నిరంతరం పర్యవేక్షించి, బాధితులకు అండగా నిలిచిన మైనార్టీశాఖ సంక్షేమశాఖ మంత్రిని కూడా అభినందించారు. ఈ విషాదకర సంఘటనపై స్పందిస్తూ నాయకులు, మృతులకు నివాళ్లు అర్పించి, వారి కుటుంబాలకు ధైర్యం చెప్పారు. నివాళ్లు అర్పించిన వారిలో జిల్లాకార్యనిర్వాహక అధ్యక్షులు కె.ఆర్.రాజ్‌కుమార్, జె.బాల్‌రాజ్, ఖాలేద్‌అహ్మద్, శంకర్, శ్రీధర్, సెంట్రల్‌యూనియన్ ఉపాధ్యక్షులు పర్వతాలతో పాటు పెద్ద సంఖ్యలో ఉద్యోగులు పాల్గొన్నారు. ప్రభుత్వం ప్రాణాలు కోల్పోయిన కుటుంబాలకు అన్ని విధాలుగా అండగా ఉండాలని కోరారు.

## ఎస్టిపి నిర్మాణాన్ని నిరసిస్తూ ఆందోళన



ఆందోళన చేస్తున్న నాయకులు ,కాలనీ వాసులు,

**హయత్‌నగర్, నవంబర్ 18 ప్రభాతవార్త:**
పెద్ద అంబర్ పేట్ గ్రామ రెవెన్యూ పరిధి సర్వే నెంబర్ 292 లో ఎస్టీపీ నిర్మాణాన్ని నిరసిస్తూ అంబికా నగర్, స్వగృహ కాలనీ, పోలీస్ కాలనీ, దయాకర్ రెడ్డి కాలనీవాసులు మంగళవారం ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా గ్రామ పెద్దలు, నాయకులు మాట్లాడుతూ....ఎస్టీపీ నిర్మాణంతో భూగర్భ జలాలు కలుషితమై ప్రజల ఆరోగ్యాలు దెబ్బతినే ప్రమాదం ఉందన్నారు. అంతేకాకుండా ఈదుల చెరువు సైతం కలుషితమై చేపల పెంపకానికి ఇబ్బందిగా మారే అవకాశం ఉందన్నారు. ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని జనావాసాల నడుమ కాకుండా మరో చోట ప్లాంట్ నిర్మాణానికి చర్యలు తీసుకో వాలని డిమాండ్ చేశారు. ఎస్టీపీ వద్దు... పార్కులు ముద్దు అంటూ నినాదాలు చేశారు. ఎస్టీపీ ప్లాంట్ నిర్మిస్తే అడ్డుకుంటామన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు దండం రాజశేఖర్ రెడ్డి, మాజీ కౌన్సిలర్లు దండం కృష్ణారెడ్డి, చల్లూరి మురళీధర్ రెడ్డి, నాయకులు పెంటయ్య, లిక్కిడి కృష్ణారెడ్డి, సిద్దెంకి చిన్న భూపాల్ రెడ్డి, మరియాల రాజు, అయ్యప్ప రెడ్డి, దాసరి నర్సింగ్ రావు, కడ్తాల్ అశోక్ రెడ్డి, పిల్లి శ్రీనివాస్ యాదవ్, సిద్దంకి జగన్ మోహన్ రెడ్డి పాల్గొన్నారు.

## ఆధ్యాత్మిక భావనలతో మానసిక ప్రశాంతత : ప్రిన్సిపాల్ సురేష్



సాయి చైతన్య కళాశాలలో దీపాలు వెలిగిస్తున్న కళాశాల విద్యార్థులు

**మలక్ పేట, నవంబర్ 18, ప్రభాతవార్త:**
ఆధ్యాత్మిక భావనలతో మానసిక ప్రశాంతత చేకురుతుందని సాయి చైతన్య జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్, కరస్పాండెంట్ చల్లగుల్ల సురేష్ బాబు పేర్కొన్నారు. దిల్ షుక్ నగర్ సాయి చైతన్య జూనియర్ కళాశాలలో కార్తీక మాసాన్ని పురస్కరించుకుని సహస్ర దీపాలంకరణ కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ చల్లగుల్ల సురేష్ బాబు విద్యార్థులతో కలిసి దీపాలను వెలిగించి భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పండుగలు సంస్కృతి సంప్రదాయాలను ప్రతిబింబిస్తాయని తెలిపారు. తమ కళాశాలలో విద్యార్థులకు పాఠ్యాంశాలను బోధించడంతోపాటు అన్ని అంశాలపై అవగాహన కల్పిస్తున్నామని వివరించారు. కళాశాలలో ఇటువంటి కార్యక్రమాలను నిర్వహించడంతో విద్యార్థులకు పండుగలు, వాటి విశిష్టత, ప్రాధాన్యత గురించి తెలుస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## సమస్యలతో సతమాతం... పట్టించుకోని అధికార ఘనం



ఇళ్ల పక్కన నిలిచిన మురుగు నీటిని చూపుతున్న నివాసితుడు.

**హయత్ నగర్, నవంబర్ 18 ప్రభాతవార్త :**
డబల్ బెడ్ రూమ్ ఇళ్ల సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహ రిస్తోందని నివాసితులు మండి పడుతున్నారు. హయత్ నగర్ లో హత్తి గూడ సమీపంలో 432 ఇళ్లతో డబల్ బెడ్ రూమ్ లను నిర్మించింది. విజయవాడ జాతీయ రహదారి నుండి 2 కిలోమీటర్ల దూరంలో ఉన్న ఇళ్ళకు బస్సు సౌకర్యం లేకపోవడంతో నివాసితులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఉపాధి కోసం నాగరానికి వెళ్లే వారితో పాటు పాఠశాలలు, కళాశాలలకు వెళ్లే విద్యార్థులు, వృద్ధులు మరింత ఇబ్బందిగా ఉంది. దీనికి తోడు సరైన డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడంతో మురుగు నీరు ఇళ్ల పక్కనే నిలుస్తోంది. దోమలు వృద్ధి చెంది, దుర్గంధం వ్యాపిస్తోంది. అంటు వ్యాధులు వ్యాపించే ప్రమాదం ఉందని నివాసితులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. బస్తీ దావఖానా ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

### తుర్కయంజాల్ మున్సిపాలిటీలో నశా ముక్త్ భారత్ అభియాన్



**తుర్కయంజాల్ నవంబర్ 18, ప్రభాతవార్త**
తుర్కయంజాల్ మున్సిపాలిటీ వార్డు కార్యాలయంలో నాశ ముక్త్ భారత్ అభిమాన్ ఐదోవ వార్షికోత్సవం లో భాగంగా యువతలో మాదకద్రవ్యాల దుర్వినియోగాన్ని అరికట్టేందుకు, వారి సృజనాత్మకతను వెలికితీయడానికి సామాజిక న్యాయం మరియు సాధికారత శాఖ ఆదేశముల మేరకు తుర్కయంజాల్ పురపాలక సంఘము నందు డీఈ భిక్షపతి అందరు అధికారులు మరియు సిబ్బంది తో ప్రతిజ్ఞ చేయించారు. ఈకార్యక్రమంలో శ్రీనివాస్ మేనేజర్.వివిధ సెక్షన్ల అధికారులు, సెక్షన్ అసిస్టెంట్లు, వార్డు అధికారులు మరియు సిబ్బంది పాల్గొన్నారు.

### బిఆర్ఎస్ నాయకుల మీద కేసులు ఎత్తివేయాలి



**మల్కాజిగిరి నవంబర్ 18 ప్రభాతవార్త :**
మల్కాజ్గిరి కి చెందిన బీఆర్ఎస్ నాయకుల మీద అక్రమంగా పెట్టిన కేసులను ఎత్తి వేయాలని కోరుతూ డీజీపీ కార్యాలయంలో రాష్ట్ర డిజిపికి మల్కాజ్గిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి మంగళవారం కలిసి వినతి పత్రం సమర్పించారు. కొంతకాలం క్రితం బీఆర్ఎస్ నేత మేకల రాము యాదవ్ పై దాడి చేయడమే కాకుండా అక్రమంగా 11 కేసులను కాంగ్రెస్ నాయకులు పెట్టించారని ముమ్మాటికి అవి అక్రమంగా కేసులు పెట్టినవేనని డిజిపి దృష్టికి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి తీసుకెళ్లారు. టిఆర్ఎస్ నాయకుల మీద పెట్టిన అక్రమ కేసులను ఎత్తివేయాలని కోరారు.

## రైతులకు మెరుగైన గిట్టుబాటు ధరలు అందించడానికి కృషి : ఛైర్మన్ చేకోలేకర్ లక్ష్మి



మార్కెట్ కమిటీ డైరెక్టర్లతో కలిసి కేక్ ను కట్ చేస్తున్న హైదరాబాద్ నగర వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్ చేకోలేకర్ లక్ష్మి , టీపీసీసీ మాజీ ప్రధాన కార్యదర్శి చెకోలేకర్ శ్రీనివాస్, వైస్ ఛైర్మన్ కోట్ల శ్రీనివాస్ తదితరులు

**మలక్ పేట, నవంబర్ 18, ప్రభాతవార్త:**
రైతులకు ఎల్లవేళలా అందుబాటులో ఉండి వారికి మెరుగైన గిట్టుబాటు ధరను అందించడానికి కృషి చేస్తున్నామని హైదరాబాద్ నగర వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్ చేకోలేకర్ లక్ష్మి పేర్కొన్నారు. హైదరాబాద్ నగర వ్యవసాయ మార్కెట్ కమిటీ ఏర్పడి సంవత్సరం పూర్తయిన సందర్భంగా సలీం నగర్ లో నిర్వహించిన అభినందన సభలో ఛైర్మన్ చెకలేకర్ లక్ష్మి, టిపిసిసి మాజీ ప్రధాన కార్యదర్శి చెకోలేకర్ శ్రీనివాస్, వైస్ ఛైర్మన్ కోట్ల శ్రీనివాస్, డైరెక్టర్లతో కలిసి కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మార్కెట్టుకు వచ్చే రైతులకు అన్ని సౌకర్యాలను కల్పిస్తున్నామని పేర్కొన్నారు. మలక్ పేట మహబూబ్ మాన్షన్ మార్కెట్ లో పలు అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టడం జరిగిందని తెలిపారు. అదేవిధంగా హైదరాబాద్ మార్కెట్ కమిటీ పరిధిలోని మార్కెట్లను అన్ని విధాలుగా అభివృద్ధి చేసి ఆధునికరించడానికి కృషి చేస్తున్నామని వివరించారు. మార్కెట్లోని రైతులు, వ్యాపారస్తుల సమస్యలను తెలుసుకుని వాటిని పరిష్కరిస్తున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్లు ప్రత్యూష , మస్రత్ సుల్తానా, కిషన్ సింగ్, మహమ్మద్ షకీల్, దుగ్గు జగదీష్, మాదారం కృష్ణ, నేలపాటి రామారావు, సత్యనారాయణ, రాజేందర్ రెడ్డి, సాయిరాం, ముసారంబాగ్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు లింగాల శ్రీనివాస్ గౌడ్, నాయకులు మహేష్, చేకోలేకర్ కృష్ణ పాల్గొన్నారు.

## ప్రభుత్వ ఆస్తులను కాపాడిన కార్యసాధకుడు గగన్ కృషి మరువలేనిది



జమ్మిగడ్డ ప్రభుత్వ భూమికి ఫెన్సింగ్ వేస్తున్న జిహెచ్ఎంసి అధికారులు.

**కుషాయిగూడ, నవంబర్ 18, ప్రభాతవార్త.**
గత కొన్ని సంవత్సరాలుగా తన సొంత నిధులతో సంవత్సరాల తరబడి కోర్టులో చుట్టూ తిరిగి 199 ప్రభుత్వ స్థలం పరిరక్షించాలంటూ పోరాడిన హ్యూమన్ రైట్స్ సభ్యులు ,సమాచార హక్కు చట్టం గ్రేటర్ హైదరాబాద్ ప్రతినిధి, జమ్మిగడ్డ స్మశాన వాటిక పరిరక్షణ సమితి కన్వీనర్ తాదూరిగగన్ కుమార్ కృషి ఫలితంగా జిల్లా కోర్టు 199 ప్రభుత్వ స్థలం పై తీర్పునిచ్చింది. తీర్పును అనుసరించి జిహెచ్ఎంసి అధికారులు మంగళవారం ఉదయం జమ్మిగడ్డ స్థలాన్ని సందర్శించి కోర్టు ఆదేశానుసారం ప్రభుత్వ భూమికి ఫెన్సింగ్ వేయడానికి శ్రీకారం చుట్టారు. 107 ఎకరాలు గల ప్రభుత్వ భూమిని ఇప్పటికే 90 శాతం కబ్జాకు గురికాగా, మిగిలిన భూమిని, స్మశాన వాటికను కాపాడాలంటూ గగన్ కుమార్ చేసిన కృషికి కోర్టు నిర్ణయం తోడవడంతో ఎట్టకేలకు ప్రభుత్వ స్థలం కాపాడే అవకాశం లభించింది. వ్యక్తిగత స్వార్థాన్ని వదిలేసి ప్రజల కోసం పోరాడుతున్న గగన్ సేవలను జమ్మిగడ్డ 36 కాలనీ లవర్స్ ప్రశంసించారు. జిహెచ్ఎంసి టౌన్ ప్లానింగ్ ఏసిపి కృష్ణ మోహన్ మాట్లాడుతూ ప్రభుత్వ స్థలాల పరిరక్షణకు కఠినంగా చర్యలు తీసుకుంటున్నామన్నారు. జమ్మిగడ్డ ప్రభుత్వ స్థలాన్ని కాపాడేందుకు పగడ్బందీగా ప్రహరీ గోడ నిర్మిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఇంజనీరింగ్ విభాగం ఈఈ నాగేందర్, డి ఈ బాలకృష్ణ, మండల రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు. అధికారులు స్పందించి ఫెన్సింగ్ వేయడం పట్ల గగన్ కుమార్ హర్షం వ్యక్తం చేశారు.

## రామంతాపూర్ శివాలయం భూమిలో అక్రమ నిర్మాణం

**-లీజు పేరుతో బినామీ దందా.. స్థానికుల ఆందోళన**



శివాలయం భూమిలో షెడ్డు నిర్మాణం నిలిపివేయాలని ఆందోళన చేస్తున్న మహిళలు

**రామంతాపూర్, నవంబరు 18 ప్రభాతవార్త :** రామంతాపూర్‌లో శివాలయం భూమిలో అనుమతి లేకుండా నిర్మాణాలు చేయడం వివాదంగా మారింది. శివాలయం భూమిని లీజుకు తీసుకుని కొందరు వ్యక్తులు అందులో పక్కా నిర్మాణాలు సాగిస్తున్నారు. దీంతో కాలనీలకు వెళ్లే రహదారిని మూసివేయడంతో మంగళవారం పలువురు మహిళలు స్థలం వద్ద ధర్నా నిర్వహించారు. వివరాలు ఇలా ఉన్నాయి. రామంతాపూర్ శ్రీరామకాలనీలో పురాతన శివాలయానికి చెందిన సుమారు 27 గుంటల భూమి ఉంది. దీనిని కొద్ది రోజుల క్రితం దేవాదాయశాఖ అధికారులు మూడేళ్ల కాల పరిమితి కోసం లీజు వేలం నిర్వహించారు. ప్రతి నెలా 43వేలు చెల్లించే విధంగా కొందరు ఈ స్థలాన్ని తీసుకున్నారు. అయితే సదరు స్థలంలో గడ్డి వేసుకోవడంతోపాటు, తాత్కాలికంగా పనులు చేసుకోవాల్సి ఉంటుంది. అయితే దేవాదాయశాఖ అధికారుల నిర్లక్ష్యం వల్ల లీజుకు ఇచ్చిన స్థలం క్రీడా మైదానం నిర్మిస్తున్నారు. నిబంధనల ప్రకారం లీజుకు తీసుకున్న స్థలంలో కూడా ఎటువంటి పక్కా నిర్మాణాలు చేయవద్దని ఆదేశాలు ఉన్నాయి. అయితే దీనిని తుంగలో తొక్కి ఇందులో పక్కా నిర్మాణాలు చేస్తున్నారని మహిళలు ఆందోళనకు దిగారు. ఈ స్థలం చుట్టూ గేటు ఏర్పాటు చేయడంతోపాటు, రహదారిని మూసి వేయడంతో పలువురు మహిళలు ఆందోళనకు దిగారు. గతంలో ఎలా ఉందో అదే విధంగా వ్యాపారం సాగించాలని, అయితే నిబంధనలకు వ్యతిరేకంగా నిర్మాణాలు చేయడంతోపాటు ఇందులో పూర్తి స్థాయిలో ఉండే విధంగా పనులు సాగిస్తున్నారు. లీజుకు తీసుకున్నప్పటి నుంచి ఇప్పటి వరకు అద్దె ఇవ్వలేదని మరికొందరు పేర్కొంటున్నారు.

**రహదారిని మూసివేతపై స్థానికుల నిరసన :**
శ్రీరామకాలనీలో తమ ఇళ్ల నుంచి వెళ్లే రహదారిని మూసివేసి తమను ఇబ్బందులకు గురిచేయడం తగదని పలువురు మహిళలు ఆందోళనకు దిగారు. వర్షం వస్తే నీరు వెళ్లేందుకు కూడా వీలు లేకుండా గోడ నిర్మిస్తున్నారని, దీని వల్ల తమకు ఇబ్బందులు వస్తాయని వారు పేర్కొంటున్నారు. దీనిపై శివాలయం కార్యనిర్వహణ అధికారి సురేంద్రను వివరణ కోరగా లీజు స్థలంలో పక్కా నిర్మాణాలు చేయవద్దని, కేవలం మూడేళ్లు వాడుకుని తిరిగి దేవాదాయశాఖకు అప్పగించాల్సి ఉంటుందని ఆయన తెలిపారు. అధికారులు స్పందించి దేవాదాయశాఖ స్థలంలో నిర్మిస్తున్న అక్రమ నిర్మాణాలపై తగు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

## ఊపిరి ఆగకూడదంటే.. సిగరెట్లు ఆపాలి




కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న సిపి సుధీర్‌బాబు

**మన్సూరాబాద్, నవంబర్ 19 ప్రభాతవార్త:**
క్రానిక్ అబ్స్ట్రక్టివ్ పల్మనరీ డిసీజ్ (సీఓపీడీ) అనేది ఎక్కువ కాలం పాటు పొగ తాగడం, లేదా పీల్చడం వల్ల ఊపిరితిత్తుల్లో వచ్చే తీవ్ర సమస్య. దీన్ని పూర్తిగా నయం చేయడం దాదాపు సాధ్యం కాదని, మధుమేహం, రక్తపోటు లాంటివి మన చేతుల్లో లేని, మనం నియంత్రించలేని వ్యాధులని అదే సీఓపీడీ అయితే మనం సిగరెట్లు కాల్చకుండా ఉంటే చాలని, ఊపిరి ఆగిపోకుండా ఉండాలంటే సిగరెట్లు కాల్చడం ఆపాల్సిందే అని రాచకొండ పోలీస్ కమిషనర్ జి. సుధీర్ బాబు తెలిపారు. అంతర్జాతీయ సీఓపీడీ దే సందర్భంగా ఎల్బీనగర్ కామినేని ఆస్పత్రిలో జరిగిన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా మాట్లాడుతూ సీఓపీడీని వీలైనంత ముందుగా గుర్తిస్తే అప్పటివరకు ఊపిరితిత్తులకు అయిన నష్టాన్ని కొంతవరకైనా తగ్గించే అవకాశం ఉంటున్నాను. సీనియర్ కన్సల్టెంట్ పల్మనాలజిస్ట్ డాక్టర్ రవీందర్ రెడ్డి మాట్లాడుతూ రోజుకు 10 సిగరెట్ల చొప్పున 20 ఏళ్లు కాల్చినా, లేదా 20 సిగరెట్ల చొప్పున పదేళ్లు కాల్చినా సీఓపీడీ వచ్చే అవకాశం ఉంటుందన్నారు. ఈ వ్యాధి ఉన్నవారు తప్పనిసరిగా న్యుమోనియా టీకా, ఇన్ఫ్లూయెంజా టీకాలు వేయించుకోవడం మంచిదన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కామినేని అకాడమీ ఆఫ్ మెడికల్ సైన్సెస్ రీసెర్చ్ సెంటర్ ప్రిన్సిపల్ డాక్టర్ సుధీర్ బాబు పద్మల్, వైద్యులు అంజయ్య కనుసోలి, శుభకర్ కంది, రవీంద్రనాథ్, డిఎస్. సౌజన్య, భరత్ జానపాటి తదితరులు పాల్గొన్నారు.

### సమస్యలను పరిశీలించిన జోనల్ కమిషనర్



జోనల్ కమిషన్ వివరాలు వెల్లడిస్తున్న అరుణాసురేందర్‌యాదవ్

**ఎల్.బి.నగర్, నవంబర్ 18 ప్రభాతవార్త:**
నాగోల్ డివిజన్ పరిధిలో ప్రజలు ఎదుర్కొంటున్న పలు సమస్యలను నాగోల్ డివిజన్ కార్పొరేటర్ చింతల సురేందర్ యాదవ్‌తో కలిసి మంగళవారం ఎల్బీనగర్ జోనల్ కమిషనర్ హేమంత్‌కేశవ్‌పాటిల్ విస్తృత పర్యటన చేసి సమస్యలను పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ సాయినగర్ నుండి ఆర్టీవో ఆఫీస్ వరకు, బండ్లగూడ నుండి శ్రావణి శ్రీఎన్క్లేవ్ వరకు స్టామ్‌వాటర్ పైప్‌లైన్ పనులు పూర్తిఅయ్యి నెలలు గడుస్తున్నా పైభాగంలో సీసీ రోడ్డులు వేయకపోవడం వల్ల ప్రజలు ప్రమాదాలకు గురవుతున్నారని కమిషనర్ దృష్టికి తీసుకువెళ్లారు. అధికారుల నిర్లక్ష్యం ప్రజల జీవితాలకు ముప్పుగా మారిందని, వెంటనే సీసీరోడ్డు పనులు ప్రారంభించాలని కోరారు. జైపూరికాలనీ చౌరస్తా నుంచి రాజ్యలక్ష్మి కాలనీ వరకు ఏర్పాటు చేసిన స్టామ్‌వాటర్ డ్రెయిన్‌లైన్స్ పూర్తయ్యి 6 నెలలు గడిచినా రోడ్డు లెవెలింగ్, సీసీ రోడ్డు పనులు నిలిచిపోవడం వల్ల ప్రతికూల పరిస్థితులు నెలకొన్నాయన్నారు. ఈ విషయాలపై స్పందించిన జోనల్ కమిషనర్ హేమంత్‌కేశవ్‌పాటిల్ పెండింగ్‌లో ఉన్న రోడ్డు పనులను ప్రాధాన్యతగా తీసుకొని అత్యవసరంగా పూర్తి చేయిస్తామని, కాలనీ వాసులకు ఇబ్బంది లేకుండా తక్షణ చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అధికారులు రమేష్‌బాబు, కనకయ్య, నీలిమ, దీపక్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణంలో యువత కీలక పాత్ర పోషించాలి

**: బడంగ్‌పేట్ డిగ్రీ కాలేజీ ప్రిన్సిపాల్ సిహెచ్ ప్రసాద్**



నషా ముక్త్ భారత్ ప్రతిజ్ఞ చేస్తున్న బడంగ్‌పేట్ ప్రభుత్వ కాలేజీ ప్రిన్సిపాల్, అధ్యాపకులు, విద్యార్థులు

**సరూర్‌నగర్, నవంబర్ 18 ప్రభాతవార్త:** డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణంలో యువత కీలక పాత్ర పోషించాలని బడంగ్‌పేట్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సిహెచ్ ప్రసాద్ పిలుపునిచ్చారు. మంగళవారం కళాశాలలో నషా ముక్త్ భారత్ ప్రతిజ్ఞ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ సమక్షంలో ఎన్ఎస్ఎస్ కో-ఆర్డినేటర్లు జ్యోతి, వెంకట్‌రెడ్డిలు వాలంటీర్లు, విద్యార్థులు, అధ్యాపకులచే ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మత్తు వల్ల జీవితాలు చిత్తవుతాయని అన్నారు. వాటికి దూరంగా ఉంటేనే జీవిత లక్ష్యాలను సాధించగలుగుతారని ఆయన తెలిపారు. డ్రగ్స్ రహిత సమాజానికి యువత నడుం బిగించి ప్రజల్లో అవగాహన కల్పించాలని ఆయన సూచించారు. డ్రగ్స్ అభ్యూస్ కో-ఆర్డినేటర్ డాక్టర్ రాజ్‌కుమార్ మత్తు పదార్థాల దుష్ప్రభావాలు, వాటి నివారణ గురించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు, విద్యార్థులు, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

## యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలి




వార్డు కార్యాలయం వద్ద అవగాహన కార్యక్రమంలో కమిషనర్ విద్యార్థులు

**హయత్ నగర్, నవంబర్ 18 ప్రభాతవార్త :**
యువత ముఖ్యంగా విద్యార్థులు మారక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని పెద్ద అంబర్ పేట మున్సిపల్ కమిషనర్ రవీందర్ రెడ్డి సూచించారు. నషా ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా మారక ద్రవ్యాల నిషేధంపై మంగళవారం తట్టి అన్నారంలోని శ్రేయాస్ ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించి విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం కుంట్లూరు మహిళా శక్తి భవనంలో స్వయం సహాయక సంఘ సభ్యులు, కాలనీ వాసులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ... మారక ద్రవ్యాలతో విద్యార్థులు, యువకులు తమ జీవితాలను నాశనం చేసుకోరాదని సూచించారు. మారక ద్రవ్యాలకు బానిసైన వారి విషయమై టోల్ ఫ్రీ నెంబర్ 14446 కి ఫోన్ చేసి డీ ఎడిక్షన్ సెంటర్ కు పంపించాలని సూచించారు. కార్యక్రమంలో డీఈఈ సుమంత్, ఆర్ఐ హరి కుమార్, ఎన్విరాన్మెంటల్ ఇంజినీర్ శ్రీనివాస్, సీనియర్ అసిస్టెంట్ సరోజ, సిబ్బంది పాల్గొన్నారు.

### పార్కు అభివృద్ధికి చర్యలు : కార్పొరేటర్ అరుణ రవీందర్‌రెడ్డి



అధికారులకు సూచనలు చేస్తున్న కార్పొరేటర్ అరుణ రవీందర్‌రెడ్డి

**సైదాబాద్, నవంబరు 18 ప్రభాతవార్త:** సైదాబాద్ డివిజన్ ఎల్ఐసి కాలనీలోని పార్కును పూర్తి స్థాయిలో అభివృద్ధి చేసి స్థానికులకు అందుబాటులోకి తీసుకురావాలని కార్పొరేటర్ కొత్త కాపు అరుణ రవీందర్‌రెడ్డి అధికారులకు సూచించారు. డిప్యూటీ డైరెక్టర్ విష్ణువర్ధన్, మేనేజర్ కిరణ్ కుమార్, సూపర్‌వైజర్ మహేష్‌లతో కలిసి పార్కును పరిశీలించిన అనంతరం అధికారులకు కార్పొరేటర్ అరుణ పలు సూచనలు చేశారు. అనంతరం కాలనీలో కమ్యూనిటీహాల్ నిర్మాణ పనులు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో పలువురు కాలనీవాసులు పాల్గొన్నారు.

## లక్ష్మీనగర్‌లో సిసి రోడ్డు పనులు ప్రారంభం



సిసి రోడ్డు పనులు ప్రారంభిస్తున్న కార్పొరేటర్ శ్వేత మధుకర్‌రెడ్డి

**సైదాబాద్, నవంబరు 18 ప్రభాతవార్త:** ఐఎస్ సదన్ డివిజన్ లక్ష్మీనగర్ థీమ్ పార్కు నుండి సాయిబాబ దేవాలయం వరకు రూ.22.77లక్షల వ్యయంతో చేపడుతున్న సిసి రోడ్డు పనులను కార్పొరేటర్ జంగం శ్వేత మధుకర్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ శ్వేత మాట్లాడుతూ రోడ్డు నిర్మాణంలో నాణ్యత పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బిజెపి సీనియర్ నాయకులు జంగం మధుకర్‌రెడ్డి, అమర్నాథ్‌రెడ్డి, కాలనీవాసులు సిఎస్ రెడ్డి, నేరెళ్ల ప్రసాదరావు, సైదా రామయ్య, నర్సింహామూర్తి, వెంకటేశ్వర్‌రావు, మాధవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### ఘనంగా అఖిల భారత సహకార వారోత్సవాలు



బద్రినారాయణను సన్మానిస్తున్న సురేఖరాణి

**ఎల్.బి.నగర్, నవంబర్ 18 ప్రభాతవార్త:**
భారత సహకార 72వ వారోత్సవాలు కొత్తపేటలో తెలంగాణ సహకార యూనియన్ లిమిటెడ్ రంగారెడ్డి కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ లిమిటెడ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి తెలంగాణ సహకార యూనియన్ లిమిటెడ్ రిజిస్ట్రార్ ఆర్.సురేఖరాణి అసిస్టెంట్ రిజిస్ట్రార్ ఆర్.విజయలు ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కో-ఆపరేటివ్ బ్యాంకులో సొసైటీలు దేశ అభివృద్ధికి దోహదపడుతున్నాయని తెలిపారు. భారత ప్రధానమంత్రి నినాదం మేరకు సహకారం ద్వారా శ్రేయస్సు అనే విధంగా కో-ఆపరేటివ్ బ్యాంకులు వారి ఆశయాన్ని నిజం చేస్తున్నాయని తెలిపారు. దేశం ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడానికి జాతీయ సహకార యూనియన్ సూచించిన విధంగా ఆత్మ నిర్భర్ భారత్ సాధకాలుగా సహకార సంఘాలు కృషి చేస్తున్నాయని అన్నారు. బ్యాంకు ఛైర్మన్ బచ్చు బద్రినారాయణ మాట్లాడుతూ తమ బ్యాంకు అభివృద్ధి పథంలో నడుస్తుందన్నారు. అతి త్వరలో 10 నూతన శాఖలు ఏర్పాటు చేయడంతో పాటు యువతకు ఉద్యోగ అవకాశాలను కల్పించేందుకు కృషి చేస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో వైస్‌ఛైర్మన్లు ఏ.మోహన్‌రెడ్డి, హనుమంతుసాగర్, డైరెక్టర్లు బివి.రావు పాల్గొని సహకార సంఘం జెండాను ఆవిష్కరించారు.

### పేదింటి ఆడబిడ్డకు ఉప్పల ఫౌండేషన్ చేయూత



పుస్తెమంటలు అందజేస్తున్న ఉప్పల స్వప్నశ్రీనివాస్‌గుప్తా

**ఎల్.బి.నగర్, నవంబర్ 18 ప్రభాతవార్త:**
నిరుపేద ఆడబిడ్డలకు తాము ఎల్లవేళలా అనగా నిలుస్తామని టీపీసీసీ ప్రచార కమిటీ రాష్ట్ర కోకన్వీనర్, అంతర్జాతీయ ఆర్యవైశ్య ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఉప్పల శ్రీనివాస్‌గుప్త పేర్కొన్నారు. నాగోల్‌లోని ఉప్పల శ్రీనివాస్‌గుప్త క్యాంపు కార్యాలయంలో అనూష వివాహానికి అవసరమైన పూస్తేమట్టెలు చీర, గాజులను స్వప్న శ్రీనివాస్‌గుప్తా అందజేశారు. ఈ సందర్భగా ఆయన మాట్లాడుతూ ఉప్పల ఫౌండేషన్ ద్వారా అనేక పేద కుటుంబాలకు చెందిన వారికి పూస్తే మట్టెలు, చీర, గాజులు అందజేయడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో బాలలక్ష్మి, సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.

### చిలుకానగర్ డివిజన్‌కు నిధులు కేటాయించాలని వినతి



గ్రేటర్ కమిషనర్ కర్ణన్‌ను కలిసి వినతి పత్రం అందజేస్తున్న చిలుకానగర్ కార్పొరేటర్ బన్నాల గీత ప్రవీణ్ తదితరులు

**ఉప్పల్, నవంబరు 18 ప్రభాతవార్త :** చిలుకానగర్ డివిజన్ అభివృద్ధికి నిధులు కేటాయించాలని స్థానిక కార్పొరేటర్ బన్నాల గీత ప్రవీణ్ మంగళవారం గ్రేటర్ కమిషనర్ ఆర్.వి.కర్ణన్‌ను కలిసి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో కార్పొరేటర్ బన్నాల గీత మాట్లాడుతూ చిలుకానగర్ డివిజన్ పరిధిలోని సర్వే ఆఫ్ ఇండియా సిగ్నల్ వద్ద పుట్ ఒవర్ బ్రిడ్జి నిర్మించాలని కోరారు. అదే విధంగా అన్ని వర్గాల ప్రజలు ఉపయోగించుకునే విధంగా కమ్యూనిటిహాల్ కోసం నిధులు కేటాయించాలని కోరారు. డివిజన్‌లో పెండింగ్‌లో ఉన్న పనులు చేపట్టేందుకు నిధులు ఇవ్వాలని ఆమె సూచించారు. దీనిపై గ్రేటర్ కమిషనర్ కర్నన్ సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. దశలవారిగా డ్రైనేజీ, సిసి రోడ్లకు నిధులు కేటాయిస్తామని హామీ ఇచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు పార్టీ నేతలు పాల్గొన్నారు.

## దేవాలయం కూల్చివేయడం అమానుషం



అధికారులతో మాట్లాడుతున్న నరసింహగుప్త

**మన్సూరాబాద్, నవంబర్ 19 ప్రభాతవార్త:**
దేవాలయాన్ని కూల్చివేసే హక్కు తమకు ఎవరు ఇచ్చారని, దేవాలయాన్ని కూల్చివేయడం అమానుషమని చైతన్యపురి డివిజన్ కార్పొరేటర్ రంగ నరసింహగుప్తా ఆగ్రహం వ్యక్తం చేశారు. చైతన్యపురి డివిజన్ ఓల్డ్ ఫ్రూట్ మార్కెట్‌లో నిర్మాణం జరుగుతున్న టీమ్స్ హాస్పిటల్ వారు ప్రభాత్‌నగర్ కాలనీ గుండా మెయిన్‌గేట్ ఏర్పాటు చేశారు. నిర్మాణం స్థలం పక్కన వున్న దేవాలయం కూల్చివేశారని సమాచారం తెలియడంతో కాలనీ వాసులతో కలిసి కార్పొరేటర్ ఆ ప్రాంతాన్ని సందర్శించారు. హాస్పిటల్ నిర్మాణం చేస్తున్న ఎల్ అండ్ టి వారితో మాట్లాడారు. గుడి నిర్మాణం చేపట్టాలని, అక్కడ గేట్ ను ఎత్తివేయాలని అధికారులతో వాగ్వాదానికి దిగారు. కార్పొరేటర్, కాలనీవాసుల డిమాండ్ మేరకు ఈ విషయం పై అధికారుల దృష్టికి తీసుకువెళ్లి త్వరలోనే పరిష్కరిస్తామని హామీ ఇచ్చినట్లు కార్పొరేటర్ తెలిపారు. దేవాలయం నిర్మించకపోతే సహించేది లేదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బాల్‌రెడ్డి, నర్సింహారావు, మహేష్‌యాదవ్, రాజగోపాల్, సుధాకర్, గౌడ్‌సాబ్, విజయ్‌కుమార్, బీజేపీ నాయకులు రుద్రారపు శంకర్, వినోద్‌యాదవ్, డివిజన్ అధ్యక్షులు నవీన్‌యాదవ్, వెంకన్న, ఉపేందర్, నరేందర్‌రెడ్డి, శివ ఉలిపే, వెంకటరమణ పాల్గొన్నారు.

### మీర్‌పేట్‌లో ఇందిరమ్మ ఇళ్ళ గృహ ప్రవేశాలు



ప్రశాంతినగర్ ఫేస్-2లో లబ్ధిదారులాలితో ఇందిరమ్మ ఇంటిని ప్రారంభించి గృహ ప్రవేశం చేయిస్తున్న మీర్‌పేట్ కమీషనర్ నాగమణి

**సరూర్‌నగర్, నవంబర్ 18 ప్రభాతవార్త:**
సిఎం రేవంత్‌రెడ్డి సారథ్యంలోని కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్ళ పథకంలో భాగంగా మహేశ్వరం నియోజకవర్గంలోని మీర్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లో పూర్తయిన మూడు ఇళ్ళ గృహ ప్రవేశ కార్యక్రమాలు మంగళవారం జరిగాయి. ఈ సందర్భంగా హాజరైన మున్సిపల్ కార్పొరేషన్ కమీషనర్ నాగమణి లబ్ధిదారులతో కలిసి గృహ ప్రవేశాలకు శ్రీకారం చుట్టారు. అనంతరం ఆమె మాట్లాడుతూ కార్పొరేషన్ పరిధిలో నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇళ్ళను సకాలంలో పూర్తి చేయాలని ఆమె లబ్ధిదారులను కోరారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ ఎఇ, వార్డు ఆఫీసర్లు, ఇందిరమ్మ కమిటీ సభ్యులు, నాయకులు పాల్గొన్నారు.

## ఆర్ఎన్ఆర్ కాలనీ సమస్యల పరిష్కారానికి కృషి : రాఘవేందర్‌రెడ్డి



సమస్యలు పరిశీలిస్తున్న బోయపల్లి రాఘవేందర్‌రెడ్డి, రామిడి శ్రీనివాస్‌రెడ్డి తదితరులు

**సరూర్‌నగర్, నవంబర్ 18 ప్రభాతవార్త:** బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లోని అల్మాస్‌గూడ ఆర్ఎన్ఆర్ కాలనీ సమస్యలను పరిష్కరించడానికి సహకరిస్తామని ఎఐసిసి విచార్ విభాగ్ కో-ఆర్డినేటర్ బోయపల్లి రాఘవేందర్‌రెడ్డి కాలనీవాసులకు హామీనిచ్చారు. మంగళవారం ఆయన కాలనీలో పర్యటించి రోడ్లు, డ్రైనేజీ సమస్యలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహేశ్వరం నియోజకవర్గ కాంగ్రెస్ ఇంఛార్జి కెఎల్ఆర్, మాజీ మేయర్ పారిజాత నర్సింహారెడ్డి, కమీషనర్ సరస్వతిల దృష్టికి తెచ్చి వారి సహకారంతో రోడ్లు, డ్రైనేజీల నిర్మాణానికి కృషి చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు రామిడి శ్రీనివాస్‌రెడ్డి, ఎదుల్ల ప్రతాప్‌రెడ్డి, నర్సింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### ఉప్పల్‌లో మెడికల్ షాపులలో డ్రగ్ ఇన్‌స్పెక్టర్ల తనిఖీలు

**ఉప్పల్, నవంబరు 18 ప్రభాతవార్త :** తెలంగాణ డ్రగ్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ డైరెక్టర్ జనరల్ షానవాస్ కాశీమ్ ఆదేశాల మేరకు మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా అసిస్టెంట్ డైరెక్టర్ ఎం శ్రీబిందు, హబ్సిగూడ, ఉప్పల్, మేడిపల్లి, శామీర్‌పేట డ్రగ్ ఇన్‌స్పెక్టర్లు ఇందిరా ప్రియదర్శిని, సరిత,అంబేద్కర్, ప్రవీణ్ తదితరులు పలు ప్రాంతాల్లోని మెడికల్ షాపులపై మంగళవారం దాడులు నిర్వహించారు. నిబంధనలు ఉల్లఘించి వ్యాపారం చేస్తున్న పలువురు నోటీసులు జారీ చేశారు. ఈ సందర్బంగా అసిస్టెంట్ డైరెక్టర్ శ్రీబిందు మాట్లాడుతూ మేడ్చల్ జిల్లా పరిధిలోని ఉప్పల్, హబ్సిగూడ మేడిపల్లి శామీర్‌పేట తదితర ప్రాంతాలలో పలు మెడికల్ షాపులపై దాడులు నిర్వహించినట్లు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం తగ్గించిన జీఎస్టీ రేట్ల ప్రకారంగా ప్రజలకు మందుల ధరలు అందుబాటులో ఉంచాలని సూచించారు. నిబంధనలు అతిక్రమించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.కార్యక్రమంలో పలువురు అధికారులు పాల్గొన్నారు.